



	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	39	26
భద్రాద్రి	39	27

రంజాన్‌మాసం



ఇఫ్తార్ (సా) : 6:27 (శనివారం)
సహర్ (ఉ) : 4:44 (ఆదివారం)

ఆధార్ కార్డు, రెండు ఫొటోలు ఉంటే చాలు రుణాలు ఇస్తామని చెప్పి, వారి పేరిట బ్యాంకుల్లో కరెంట్ ఖాతాలు తెరిచి రూ. కోట్లు లావాదేవీలు జరిపిన సంఘటనలో పోలీసులు ముందడుగు వేశారు. ఆయా కరెంట్ ఖాతాల్లోకి వచ్చిన సొమ్ము సైబర్ నేరగాళ్లు కొట్టేసిన సొమ్మేనని తేల్చిచెప్పారు. ఇటీవల ఇల్లెందులో ఐదుగురు మహిళల నుంచి ఆధార్ కార్డు, ఫొటోలు తీసుకుని వారికి తెలియకుండా కరెంట్ ఖాతాలు తెరిచిన సంఘటన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పెద్ద దుమారాన్ని లేపిన విషయం విదితమే. సదరు మహిళల పేర్ల మీద ఉన్న అకౌంట్లలో రూ.కోట్లలో లావాదేవీలు చేయగా.. తెలుసుకున్న మహిళలు సుమారు మూడు వారాలపాటు తర్జనభర్జన పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఓ వైపు ఖాతాలు ఖమ్మంలో ఉన్నాయి కాబట్టి, అక్కడ కేసు నమోదు చేయాలని, మరోవైపు సంఘటన జరిగిన ప్రాంతంలోనే కేసు నమోదు చేయాలంటూ రోజుల తరబడి తిప్పిన పోలీసులు 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు ప్రచురితమైన అనంతరం వెనువెంటనే కేసు నమోదు చేశారు. అనంతరం విచారణలో ఆధార్ లోన్ల వ్యవహారం సైబర్ నేరగాళ్ల పనిగా నిగ్గుతేల్చి ఇద్దరిని కటకటాల వెనక్కి తోసేశారు. మిగిలిన వారి కోసం వేట సాగిస్తున్నారు.



దుబాయ్ నుంచే దందా



'ఆధార్' లోన్ల స్కామ్ నిగ్గు తేల్చిన పోలీసులు

- సైబర్ నేరగాళ్ల పనేనని నిర్ధారణ
- అమాయకుల పేరిట బ్యాంకు ఖాతాలు తెరిచి దర్జాగా స్కామ్
- డిజిటల్ లావాదేవాల్లో కొట్టేసిన సొమ్ము ఖాతాలకు మళ్లింపు
- స్థానిక ఏజెంట్ల ద్వారా ఖాతాలు తెరిపించిన ఘనులు
- అటు అకౌంట్ హోల్డర్లకు, ఇటు ఏజెంట్లకు తాయిలాలు
- ఇప్పటివరకు ఐదు ఖాతాల గుర్తింపు
- ఇద్దరిని అరెస్టు చేసిన ఇల్లెందు పోలీసులు

ఖమ్మం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందుకు చెందిన ఐదుగురు మహిళలకు సంబంధించిన కేసులో శుక్రవారం స్థానిక ఏజెంట్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు వివరాలు వెల్లడించారు. సైబర్ నేరగాళ్లు దుబాయ్ నుంచి నేరాలకు పాల్పడుతున్నట్టు గుర్తించారు. సుధాకర్ అనే వ్యక్తి అశోక్ గుప్తాతో కలిసి దుబాయ్ నుంచి ఖమ్మంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో లోన్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న తన బావమరిది కస్యా చినబాబు అలియాస్ హర్షకు ఫోన్ చేశాడు. ఇతను ఖమ్మంరూరల్ మండలం గుర్రాలపాడు వాసి. ట్రేడింగ్ చేయడానికి ఒక కరెంట్ ఖాతాను తెరిచి ఇస్తే రూ. 50 వేలు ఇస్తానని చెప్పాడు. సదరు చినబాబు డబ్బుకు ఆశపడి తన భార్య ప్రియాంక పేరుమీద ఖాతా తెరిచి వివరాలు అందించాడు. అనంతరం మరికొంతకాలానికి మరో ఐదు ఖాతాలు కావాలని సుధాకర్ చెప్పగా.. చినబాబు తన భార్య ప్రియాంక స్వస్థలమైన ఇల్లెందులో తన స్నేహితుడైన చైతన్యను సంప్రదించాడు. అతని ద్వారా ఒక్కొక్కరికి రూ.15వేలు లోన్ ఇస్తామని చెప్పి ఐదుగురు డ్వాక్రా మహిళల పేరిట ఖమ్మం గాంధీచౌక్‌లో బ్యాంకు ఖాతాలను తెరిపించాడు. అనంతరం చినబాబు ఆ వివరాలను సుధాకర్, అశోక్ గుప్తాకు పంపించాడు.

ఇందుకుగాను చినబాబుకు రూ.లక్ష నగదును ఇవ్వగా.. ఖాతాలను తెరిచిన ఐదుగురు మహిళలకు ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున రూ.75వేలు ఇచ్చి మిగిలిన రూ. 25 వేలను తాను తీసుకున్నాడు. ఆ ఐదు బ్యాంకు ఖాతాలకు సంబంధించిన ఆన్‌లైన్ బ్యాంకింగ్, ఏటీఎం కార్డుల వివరాలను దుబాయ్‌లో ఉన్న వ్యక్తులకు పంపించాడు. వారు వాట్సప్ గ్రూప్ ద్వారా క్రిప్టో కరెన్సీ, బిట్ కాయిన్‌లలో పెట్టుబడి పెడితే.. పెట్టిన నగదుకు చాలా రెట్లు కలిపి ఇస్తామని సైబర్ నేరాలకు పాల్పడేవారు. కాగా దుబాయ్‌లో ఉంటున్న అశోక్ గుప్తా, సుధాకర్‌లపై హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైనట్టు భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్ వెల్లడించారు. కేసుతో సంబంధం ఉన్న నిందితులను ఇల్లెందు పోలీసులు రిమాండ్‌కు తరలించినట్టు ఆయన తెలిపారు.

స్థానిక దళారులను గుర్తిస్తేనే అడ్డుకట్ట

సైబర్ నేరాలకు పాల్పడేవారికి బ్యాంకు ఖాతాలే ముఖ్యం. అది కూడా అత్యధికశాతం కరెంట్ ఖాతాలే వినియోగిస్తారు. కరెంట్ అకౌంట్లు అయితేనే నేరగాళ్ల ఎక్కువ మొత్తంలో సొమ్ము లావాదేవీలు జరిపేందుకు అవకాశం ఉంటుంది. కాగా ఇల్లెందు స్కామ్ విషయంలో ఖాతాలన్నీ అమాయకుల పేర్లమీదనే ఉండటం గమనార్హం. ఆయా ఖాతాలకు సంబంధించి ఫిర్యాదు అందితే వెంటనే వాటిని ఫ్రీజ్ చేసిన అనంతరం, దర్యాప్తులో భాగంగా కేవైసీ పరిశీలిస్తే.. అవి అమాయకుల పేర్ల మీద ఉండటంతో పోలీసులు విస్తుపోతున్నారు. మొత్తం ఉదంతంలో సైబర్ నేరగాళ్లు స్థానికంగా ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని ఖాతాలు తెరుస్తున్నట్టుగా స్పష్టమవుతోంది. అలాంటి ఏజెంట్లను గుర్తించి దొంగ అకౌంట్లను తెరవకుండా అడ్డుకట్ట వేయగలిగితే సైబర్ నేరాలకు కొంతమేర అడ్డుకట్ట వేసే అవకాశం ఉంది. తాజాగా వెలుగులోకి వచ్చిన ఇల్లెందు కేసుకు ఎంతమందితో లింకులు ఉన్నాయి, ఇంకెన్ని ఖాతాలు తెరిచారు వంటి అంశాలపై సైబర్ సెల్ పోలీసులు కసరత్తు చేస్తున్నారు. ఇదే రీతిలో ఉమ్మడి ఖమ్మంలో వందల కొద్దీ ఖాతాలు తెరిచి దందా సాగించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

మహిళల పేర్లతో వారికి తెలియకుండా కరెంట్ ఖాతాలు తెరవడమే కాకుండా, ఆధార్ కార్డు లోన్ల పేర్లతో రూ. 15వేలు చేతిలో పెట్టి కోట్లాది రూపాయలు లావాదేవీలు జరిపిన ఉదంతంలోని గుట్టు విప్పుతూ ఆంధ్రజ్యోతి రెండు ప్రత్యేక కథనాలు ప్రచురించింది. అమాయకుల ఆధార్ కార్డులు సేకరించి బ్యాంకు ఖాతాలు తెరుస్తున్నారనీ, రుణాలు ఇప్పిస్తామని చెప్పి అక్రమాలకు పాల్పడుతున్నారంటూ మార్చి2న వెలుగులోకి తీసుకొచ్చింది. ఇల్లెందు మహిళల కరెంట్ ఖాతాలు ఫ్రీజ్ కావడానికి కారణాలను చెబుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరగాళ్ల స్థానిక ఏజెంట్లు, కొందరు గ్రామదీపికల ద్వారా నడిపిస్తున్న వ్యవహారాన్ని వివరించింది. దీంతో పోలీసు అధికారులు అదే రోజు సాయంత్రం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మార్చి 3న 'దారుణాలు.. సైబర్ నేరగాళ్లవే' అన్న శీర్షికతో మరో కథనాన్ని ప్రచురించింది. అమాయకుల నుంచి సేకరించిన కేవైసీ వివరాలు సైబర్ నేరగాళ్ల వద్దకే చేరుతున్నాయని తేల్చి చెప్పింది. పోలీసులు దర్యాప్తును పకడ్బందీగా చేసి చివరకు సైబర్ నేరగాళ్ల పనిగానే నిగ్గుతేల్చారు. దీంతో ఆంధ్రజ్యోతి కథనం అక్షరసత్యంగా నిరూపితమైంది.

ఆరుగురిపై కేసు.. ఇద్దరి అరెస్టు...

ఇల్లెందులో ఐదుగురు మహిళల నుంచి ఆధార్‌కార్డులు తీసుకుని కరెంట్ ఖాతాలు తెరిచి సైబర్ నేరగాళ్లకు ఖాతాల వివరాలను అందించిన సంఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. బాధితుల్లో ఒకరైన ఇల్లెందు మండలం ఎర్రగడ్డకు చెందిన ఎస్‌కె అఫ్రీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొలుత కొమరవెల్లి చైతన్య, కొమరవెల్లి హైమావతిపై కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం దుబాయ్‌లో ఉంటున్న సుధాకర్, అశోక్ గుప్తాతో పాటు ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడుకు చెందిన చినబాబు, ప్రియాంక దంపతులపై కేసునమోదు చేశారు. వీరిలో చినబాబు, చైతన్యలను అరెస్టు చేసి రిమాండ్ చేశారు. ఈ కేసులో మిగిలిన నిందితులతోపాటుగా మరికొందరిని కూడా అరెస్టు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. కాగా, అరెస్టయిన ఇద్దరూ.. మహిళల పేరిట ఖాతాలు తెరవడంలో సైబర్ మోసగాళ్ల తరఫున దళారులుగా వ్యవహరించారు. కాగా, అఫ్రీన్ తన ఫిర్యాదులో పేర్కొన్న వివరాలిలా వున్నాయి.. ఇల్లెందుకు చెందిన కొమరవెల్లి చైతన్య, కొమరవెల్లి హైమావతి వచ్చి నాతో పాటు ఎస్‌కె నాజియా, కళ్లూరి సౌజన్య, ఆళ్లకొండ సంధ్య, ఎస్‌కె సల్మాలకు కొటక్ మహీంద్రా బ్యాంకు నుంచి రూ.15 వేల రుణం ఇప్పిస్తామని నమ్మించారు. మా నుంచి ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, ఫోటోలు, థంబ్ ఇంప్రెషన్‌లు తీసుకున్నారు. అయితే ఆ తర్వాత ఖమ్మం గాంధీచౌక్, ఇల్లెందు బ్రాంచిల నుంచి హెచ్‌డీఎఫ్‌సీ సిబ్బంది వచ్చి మీ అకౌంట్లో రూ.లక్షల్లో లావాదేవీలు జరుగుతుండగా, అకౌంట్ ఎందుకు హోల్డ్‌లో పెట్టారని ప్రశ్నించారు. దీంతో మాకు అనుమానం వచ్చి ఖమ్మంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్రాంచికి వెళ్లి ఆరా తీయగా, మేం మోసపోయిన విషయం వెలుగులోకి వచ్చింది.

అక్రమ అబార్షన్లు అమానుషం

- వైద్య సంఘాల నాయకుల ఖండన

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 29: అనుమతి లేకుండా గర్భస్రావాలు(అబార్షన్లు) చేస్తున్న సంఘటనలు వైద్య వృత్తికి మచ్చ తెచ్చేవిగా ఉన్నాయని ఖమ్మం జిల్లా మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కంభంపాటి నారాయణరావు, డాక్టర్ జగదీష్‌బాబు, ప్రసూతి వైద్యుల సంఘం నాయకులు డాక్టర్ మువ్వా లక్ష్మీరాజేశ్వరి, డాక్టర్ రెహనాబేగం ఖండించారు. ఇలాంటి చట్ట వ్యతిరేక చర్యలు ఎవరు చేసినా అవి ఆమోదనీయం కాదని పేర్కొన్నారు. ఈ చర్యలను ఖండిస్తున్నట్టు ప్రకటించారు. .ఇటువంటి సంఘటనలపై అధికారులకు ఏ విధమైన సహకారం కావాలన్నా ఐఎంఏ నుంచి అందిస్తామని తెలిపారు. ఇలాంటి సంఘటనల్లో ఒకరిద్దరు డాక్టర్లు ఉన్నా, ఎక్కువ సందర్భాల్లో వైద్య వృత్తికి సంబంధం లేని వాళ్లే ఉంటున్నారన్నారు. మధ్యవర్తులు నడిపే ఆస్పత్రుల్లోనే ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయని వివరించారు.

ఆస్తి పన్నుల వసూలుకు ప్రత్యేక కౌంటర్లు

ఖమ్మం కార్పొరేషన్, మార్చి 29: ప్రజలు ఆస్తి పన్ను చెల్లించేందుకు డివిజన్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో ఉదయం 7గంటల నుంచి రాత్రి వరకు బిల్ కలెక్టర్లు అందుబాటులో ఉంటారని నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి ఒక ప్రకటనలో తెలిపారు. వడ్డీపై 90శాతం రాయితీ పొందేందుకు ఇంకా రెండురోజులే గడువు ఉన్నందున ప్రజలు ఆస్తిపన్నులు చెల్లించాలని కోరారు. అలాగే నగరపాలకసంస్థ కార్యాలయంలో పన్నుల వసూళ్లకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ ఉదయం 7గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ఉంటుందని, ప్రజలు ఇక్కడ కూడా పన్ను చెల్లించవచ్చని కోరారు.



కేంద్రంలో మళ్లీ బీజేపీదే విజయం

- వినోద్‌రావును గెలిపించి అభివృద్ధికి బాటలు వేసుకోవాలి
- బీజేపీ జాతీయ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి

6



పర్ణశాల రామాలయంలో ముఖ్య కార్యదర్శి, కమిషనర్

భద్రాద్రి, పర్ణశాలకు సరికొత్త రూపు

- ఆధ్యాత్మిక, పర్యాటక అభివృద్ధికి ఊతం
- ప్రాచీన నిర్మాణాలను పరిరక్షిస్తూనే అభివృద్ధి పనులు
- భక్తులకు మౌలిక సదుపాయాలపై ప్రధాన దృష్టి
- పరిశీలించిన దేవాదాయ ముఖ్య కార్యదర్శి, కమిషనర్

6



టీడీపీ సీనియర్ కార్యకర్తలను సన్మానిస్తున్న హరీష్, వరలక్ష్మి

ఘనంగా టీడీపీ ఆవిర్భావ వేడుకలు

- 42మంది సీనియర్ నాయకులు, కార్యకర్తలకు సత్కారం
- ఎన్టీఆర్ రాజకీయ ప్రస్థానంపై ఫొటో ఎగ్జిబిషన్
- తెలుగు రాష్ట్రాలపై టీడీపీ ముద్రను కీర్తించిన నేతలు
- వేడుకల్లో పాల్గొన్న బీజేపీ ఎంపీ అభ్యర్థి వినోద్‌రావు

చిగురిస్తున్న స్నేహం

- టీడీపీతో బీజేపీ నేతల మంతనాలు
- లోక్‌సభ ఎన్నికల్లో కొత్త సమీకరణాలు
- బీజేపీకి టీడీపీ మద్దతుపై కసరత్తు
- జాతీయస్థాయిలో ఎన్డీఏలో చేరడంతో పొడిచిన పొత్తు
- మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ వెన్నంటి నిలిచిన 'తమ్ముళ్లు'
- ముఖ్యనేతలను కలిసిన బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు



ఖమ్మం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలుగుదేశం పార్టీ ఎన్డీఏలో చేరటంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కూడా బీజేపీ, టీడీపీ మధ్య స్నేహం చిగురించబోతోంది. ఏపీలో కలిసి పోటీలో ఉన్నందున లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఖమ్మంలో కలిసి ప్రయాణం చేద్దామని బీజేపీ నేతలు టీడీపీ నేతలతో మంతనాలు సాగిస్తున్నారు. ఖమ్మం బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణతోపాటు జిల్లా నేతలు పలువురు ఇప్పటికే టీడీపీ కార్యాలయానికి వెళ్లి ఆ పార్టీ నాయకులను కలిశారు. 1999, 2014, ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ కలిసి పోటీ చేశాయని రాష్ట్ర విభజన తరువాత మళ్లీ ఎన్డీఏలో టీడీపీ చేరినందున తెలంగాణలో కూడా కలిసి పోటీకి దిగుతున్నామని బీజేపీ నేతలు టీడీపీ జిల్లా నేతలతో సంప్రదించారు. అయితే పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాల రీత్యా తమ నిర్ణయం ఉంటుంది తప్ప స్వతంత్రంగా తాము నిర్ణయం తీసుకోబోమని జిల్లా టీడీపీ నేతలు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది.

జిల్లాలో గత అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, కాంగ్రెస్ విజయం కోసం ఖమ్మం జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా పనిచేసింది. ఉమ్మడి జిల్లాలో టీడీపీకి ఘననీయమైన ఓటు బ్యాంకు ఉండడంతో బీజేపీ ఇక్కడ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. రాష్ట్ర విభజనకు ముందు తెలుగుదేశం పార్టీ కాంగ్రెస్‌తో ఢీ అంటే ఢీ అన్నట్టుగా ఉండేది. 2009లో ఖమ్మం లోక్‌సభతోపాటు 3 అసెంబ్లీ స్థానాలను టీడీపీ కైవసం చేసుకుంది. మరికొన్ని నియోజకవర్గాల్లో 5 నుంచి 9వేల ఓట్ల తేడాతో ఓటమి చెందింది.

2014లో ఖమ్మంలో టీడీపీ, వైసీపీ చేతిలో స్వల్ప తేడాతో ఓటమి పాలైంది. మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్వల్ప ఓట్ల తేడాతో పార్టీ అభ్యర్థులు ఓడి పోయారు. ఆ ఎన్నికల్లో 10 నియోజక వర్గాల్లో టీడీపీకి 4,77,413 ఓట్లు లభించాయి. ఆ తరువాత తుమ్మల నాగేశ్వరరావు టీఆర్ఎస్‌లో చేరటంతో టీడీపీ ఓటు బ్యాంకు టీఆర్ఎస్‌కు బదిలీ అయ్యింది. 2014లో కేవలం లక్షా 55వేల ఓటు బ్యాంకు ఉన్న టీఆర్ఎస్ 2018లో 6లక్షల 74వేలకు చేరుకుంది. 2014లో ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావుకు 4లక్షల 10వేల ఓటు బ్యాంకు లభించింది. 2019లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన నామాకు 5లక్షల 63వేల ఓట్లు లభించాయి. గతంలో టీడీపీ ఓటు బ్యాంకు ఎక్కువ శాతం బీఆర్ఎస్‌కు బదిలీకావడంతో నామా భారీ ఆధిక్యంతో గెలుపొందారు.

జిల్లాలో బీజేపీకి గత లోక్‌సభ ఎన్నికల్లో 20వేల 300ఓట్లు మాత్రమే లభించాయి. ఈ పరిణామాల నేపథ్యంలో తెలుగుదేశంతో కలిసి వెళ్లటం ద్వారా జిల్లాలో కాంగ్రెస్, టీఆర్ఎస్‌లో ఉన్న టీడీపీ సానుభూతి ఓటు బ్యాంకును కొంతవరకైనా మళ్లించుకోవచ్చని బీజేపీ ఆశ పడుతోంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా టీడీపీ కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని సత్తుపల్లి, అశ్వారావుపేటల్లో గెలుపొందగా ఖమ్మంలో 10వేల ఓట్ల తేడాతో ఓటమి చెందింది. 2018లో జిల్లాలో పోటీచేసిన నియోజకవర్గాల్లో టీడీపీకి 2లక్షల 52వేల 930ఓట్లు లభించాయి.

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ ఎక్కడా పోటీ చేయకుండా కాంగ్రెస్ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేసింది. ఈ నేపథ్యంలో బీజేపీ ఖమ్మంలో టీడీపీతో కలిసి ప్రయాణం చేయాలని చర్చలు సాగిస్తోంది. అయితే టీడీపీ ఇంకా అధికారికంగా ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాత్రం ఎన్డీఏలో తెలుగుదేశం కలిసి ఉన్నందున టీడీపీ, జనసేన పార్టీలను జిల్లాలో కలుపుకొని వెళతామని ఎన్నికల ప్రచారానికి చంద్రబాబు నాయుడిని, పవన్ కల్యాణ్‌ను ఆహ్వానిస్తామని చెబుతున్నారు.

- నాసిరకంగా ఎర్రబోరు రహదారి పనులు
- రోడ్డు పక్కనుండే చవుడు మట్టితో కల్వర్టు
- కుంగుతున్న తాజా నిర్మాణం
- క్యూరింగ్ లేక చిట్లిపోతున్న సిమెంట్ పనులు
- చర్యలకు ఆదివాసీల డిమాండ్



చవుడు మట్టితో నిర్మించిన కల్వర్టు

నాణ్యతకు చెల్లు..

అవినీతి పుల్లు

'మేడిగడ్డ, కాళేశ్వరం బ్యారేజీలు కుంగితేనే దిక్కులేదు.. ఈ రోడ్డు కుంగితే ఏంటి.. ఒక వేళ కుంగినా నేనే కదా మరమ్మతు చేయాల్సింది...' అంటూ రహదారి నాణ్యతను ప్రశ్నించిన ఎర్రబోరు ఆదివాసీలపై కాంట్రాక్టరు తరపున పనులను పర్యవేక్షించే వ్యక్తి చిర్రుబుర్రులాడాడు.

దుమ్ముగూడెం మార్చి 29: ఐటీడీఏ ఇంజనీరింగ్‌శాఖ పర్యవేక్షణలో జరుగుతున్న పెదకమలాపురం-ఎర్రబోరు ప్రధాన రహదారి ఆధునికీకరణ పనులకు రూ.80లక్షల నిధులు మంజూరయ్యాయి. టెండరు పొందిన ప్రధాన కాంట్రాక్టరు నుంచి భద్రాచలానికి చెందిన ఓ కాంట్రాక్టర్ సబ్ కాంట్రాక్టుపై పనులు చేపట్టారు. కొద్ది రోజులుగా కల్వర్టులు, సైడ్‌బరమ్స్, వెట్‌మిక్స్ పనులు జరుగుతున్నాయి. కాగా కల్వర్టులు, రహదారి నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయనే విమర్శలున్నాయి. సైడ్ బరమ్స్ నిర్మాణం కోసం రహదారి పక్కగా ఉన్న చవుడు మట్టిని తీసి పోస్తుండడం పట్ల ఎర్రబోరు ఆదివాసీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ ఇలాగే చవుడు మట్టి పోయడంతో రహదారి బురదమయంగా మారి వర్షాకాలంలో నానా పాట్లు పడ్డామని, నాణ్యమైన మట్టిని పోయాలని ఈనెల 26న అక్కడి ఆదివాసీ ప్రజలు కాంట్రాక్టరును కోరారు. వారు ఆశించిన విధంగా నాణ్యత గల మట్టిని పోయకపోగా, వారు ఊహించని విధంగా మేడిగడ్డ కుంగుబాటు సమాధానం కాంట్రాక్టరు నుంచి రావడంతో ఆదివాసీలు చేసేదేమీలేక వెనుదిరిగారు. పనులు నాణ్యవంతంగా జరిగేలా ఉన్నతాధికారులు చూడాలని వారు కోరుతున్నారు.



కల్వర్టుకు ప్యాచ్ వర్కు చేస్తున్న కూలీ

క్యూరింగ్ లేని కల్వర్టులు...

ఈ రహదారిపై నాలుగు చోట్ల కల్వర్టులు నిర్మిస్తుండగా, అందులో మూడు పూర్తయ్యాయి. మరో కల్వర్టు పనులు మొదలయ్యాయి. వారం క్రితమే మూడు కల్వర్టులు పూర్తవగా, వాటికి క్యూరింగ్ జరగడం లేదని ఆదివాసీలు విమర్శిస్తున్నారు. క్యూరింగ్‌ను గాలికొదిలేయడంతో ఒక కల్వర్టు అంచులో సిమెంటు పెచ్చులుగా ఊడిపోతోంది. మరో కల్వర్టు వెనుక భాగం సైతం పెచ్చులుగా లేచిపోవడంతో సిమెంటు మాలుతో అద్ది మరమ్మతులు చేశారు. కల్వర్టు, రహదారి పనులు నాసిరకంగా జరిగాయంటూ ఎర్రబోరు ఆదివాసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పనులు నాసిరకంగా ఉన్నాయి

● సొందె వెంకట్రాజు, ఎర్రబోరు



ఎర్రబోరు రహదారి నిర్మాణ పనులు నాసిరకంగా ఉన్నాయి. కల్వర్టు ప్రాంతంతో పాటు రహదారిపై మరి కొన్ని చోట్ల చవుడు మట్టి పోసి నిర్మిస్తున్నారు. పనులు నాణ్యతగా చేయమని కాంట్రాక్టరును ప్రశ్నిస్తే చాలా దురుసుగా సమాధానం ఇచ్చారు. రోజుల తరబడి కల్వర్టులను క్యూరింగ్ చేయడం లేదు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

పనులు నాణ్యతతో చేపట్టాలి

● వెంకటేశ్వర్లు, ఐటీడీఏ ఏఈ

చవుడు మట్టి పోసిన ప్రాంతాల్ని పరిశీలిస్తాం. అవసరమైతే దానిని తొలగించి నాణ్యమైన మట్టిని పోయిస్తాం. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు నాణ్యతగా జరిగేలా చూస్తాం. పనులు నాణ్యత లేకపోతే చర్యలు తీసుకుంటాం.

కానరాని జలపుష్పాలు


వెలవెలబోతున్న పాలేరు జలాశయం

- పాలేరు అడుగంటడంతో చేపల, రొయ్యల ఎదుగుదల, దిగుబడిపై ప్రభావం
- ఆదాయాన్ని కోల్పోతున్న వెయ్యి కుటుంబాలు
- ఆందోళనలో మత్స్యకారులు

ప్రతీ సంవత్సరం వేసవి సమీపిస్తున్న తరుణంలో చేపలవేటే జీవనాధారంగా ముందుకు వెళుతున్న మత్స్యకారుల కుటుంబాలకు వర్షాభావపరిస్థితులు శాపంగా మారాయి. కోట్ల రూపాయల జలపుష్పాల ఎగుమతులతో ఏడాదిపాటు కుటుంబాలను పోషించుకునే ఆదాయాన్ని కోల్పోవడంతో వారి భవిష్యత్తు ఆగమ్యగోచరంగా తయారియంది. వందలాది మత్స్యకుటుంబాలతో పాటు అనుబంధంగా కొనసాగుతున్న కుటుంబాలు మరోఏడాదిపాటు నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ఆరునెలలనుంచి కృష్ణా పరీవాహక ప్రాంతంలో సరైన వర్షాలు కురవకపోవడంతో పాలేరు జలాశయానికి సాగర్ జలాలు చేరక, నీటిమట్టం గణనీయంగా పడిపోయింది. దీంతో చేపల ఎదుగుదల పూర్తిగా నిలిచిపోయింది.

కూసుమంచి, మార్చి 29: ప్రతీ సంవత్సరం వేసవి సమీపిస్తున్న తరుణంలో చేపలవేటే జీవనాధారంగా ముందుకు వెళుతున్న మత్స్యకారుల కుటుంబాలకు వర్షాభావపరిస్థితులు శాపంగా మారాయి. కోట్ల రూపాయల జలపుష్పాల ఎగుమతులతో ఏడాదిపాటు కుటుంబాలను పోషించుకునే ఆదాయాన్ని కోల్పోవడంతో వారి భవిష్యత్తు ఆగమ్యగోచరంగా తయారియంది. వందలాది మత్స్యకుటుంబాలతో పాటు అనుబంధంగా కొనసాగుతున్న కుటుంబాలు మరోఏడాదిపాటు నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ఆరునెలలనుంచి కృష్ణా పరీవాహక ప్రాంతంలో సరైన వర్షాలు కురవకపోవడంతో పాలేరు జలాశయానికి సాగర్ జలాలు చేరక, నీటిమట్టం గణనీయంగా పడిపోయింది. దీంతో చేపల ఎదుగుదల పూర్తిగా నిలిచిపోయింది.

వెయ్యి మత్స్యకార కుటుంబాలపై ప్రభావం

ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితుల కారణంగా పాలేరు జలాశయంలో నీరు అడుగంటి పోవడంతో చేపల షికారుపై ప్రభావం పడింది. చెరువుపై ఆధారపడి సుమారు వెయ్యికి పైగా కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. ఈమూడు నెలల్లో సంపాదించే డబ్బు వచ్చే ఏడాది మొత్తానికి ఖర్చు చేసుకుంటారు. ఈపరిస్థితుల్లో ఉపాధి పనులకు, వరి కోతలకు ఇతర కూలీ పనులకు వెళుతున్నారు. ఒక్కో కుటుంబానికి సుమారు రూ.లక్ష వరకు ఆదాయం కోల్పోయినట్లయింది. ప్రభుత్వమే గుర్తించి ఆదుకోవాలని మత్స్యకార కుటుంబాలు కోరుతున్నాయి.

పాలేరు జలాశయంలో ముఖ్యంగా రొయ్యల, చేపల వేట ఎక్కువగా సాగుతుంది. ఇక్కడ లభించేది మంచి నీటి రొయ్య కావడంతో ఈరొయ్యలకు విదేశాల్లో ఎక్కువ డిమాండ్ ఉంటుంది. ఎనిమిది నెలల ముందు రొయ్య, చేపపిల్లలను విడుదల చేసిన అనంతరం, ముఖ్యంగా ఏప్రిల్ నెల నుంచి సుమారు నాలుగు నెలల పాటు షికారు జరుగుతుంది. ఖమ్మం జిల్లా మత్స్యకారులే కాకుండా పరిసర సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన మత్స్యకారులు కూడా ఇక్కడ చేపల, రొయ్యల వేట సాగిస్తుంటారు. జలాశయంలో పెంచే తెల్ల చేపపిల్లలను, రొయ్యపిల్లలను ప్రభుత్వం ఖర్చు భరించి వదులుతోంది. స్కాంబియా రకానికి చెందిన రొయ్యపిల్లలను వదులుతుంటారు. ఇవి పెరిగిన అనంతరం వేటాడిన రొయ్యలను మత్స్యకారులు విక్రయిస్తుంటారు. ఏగ్రేడ్ రకం రొయ్యలను రూ.250కు, బీ గ్రేడ్‌రకం రూ.150కు విక్రయిస్తుంటారు.

పాలేరు వెలవెల

ప్రస్తుతం పాలేరు జలాశయం వెలవెలబోతోంది. కృష్ణా పరీవాహకప్రాంతాల్లో ఈఏడాది సరైన వర్షాలు లేకపోవడంతో పాలేరు జలాశయానికి ఆశించినస్థాయిలో సాగర్ జలాలు రాలేదు. రెండుమూడుసార్లు సాగర్ డ్యామ్ నుంచి 2.5 టీఎంసీలు కేటాయించి, నీరు వదిలినా.. ఎగువున ఉన్న నల్గొండ జిల్లాలో అధికంగా నీరు వాడుకోవడంతో సాగర్ జలాలు పాలేరు చేరలేదు. దీంతో 23 అడుగుల నీటిమట్టానికి ప్రస్తుతం కేవలం 7 అడుగులకు పడిపోవడంతో వెలవెలబోతుంది. చేపలు, రొయ్యలు ఎదుగుదలకు కనీసం 18 అడుగుల మేర నీరు నిల్వ ఉండాలని మత్స్యకారులు తెలిపారు. దీంతో ఆర్నెల్లకాలంలో కనీసం 12, 13 అడుగులకు కూడా ఎన్నడూ సరిగా నీరు నిల్వలేదు. దీంతో ఒక్కో చేప కనీసం రెండు, మూడు కిలోలు ఎదగాల్సి ఉండగా అరకిలో కూడా ఎదగలేదన్నారు. రొయ్యలు 100గ్రాములు సైజు కూడా రాలేదని తెలిపారు. దీంతో ఒక్కో మత్స్యకారుడు రోజు సుమారు వేసవి రోజుల్లో రెండు మూడు వేలు ఆదాయాన్ని పొందాల్సి ఉండగా, కేవలం రూ.500 నుంచి వెయ్యి కూడా రావడం లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


గత ఏడాది షికారు



మాట్లాడుతున్న పొంగులేటి సుధాకర్ రెడ్డి

కేంద్రంలో మళ్లీ బీజేపీదే విజయం

- ఇతర పార్టీల నుంచి త్వరలోనే చేరికలు
- వినోద్‌రావును గెలిపించి అభివృద్ధికి బాటలు వేసుకోవాలి
- బీజేపీ జాతీయ నేత పొంగులేటి సుధాకర్ రెడ్డి

ఖమ్మం బైపాస్‌రోడ్డు, మార్చి 29: కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి రాబోతుందని, నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి కాబోతున్నారని బీజేపీ తమిళనాడు సహ ఇంచార్జ్ పొంగులేటి సుధాకర్ రెడ్డి, ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు పేర్కొన్నారు. నగరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కడకు వెళ్ళినా ప్రజలలో మంచి ఆదరణ లభిస్తున్నదని, ఈఎన్నికలలో దేశంలో 400సీట్లకు పైగా బీజేపీ గెలవబోతుందని పేర్కొన్నారు. ఇప్పటికే బీజేపీ చేస్తున్న అభివృద్ధి, ప్రజా ఆదరణ చూసి పలుపార్టీల నుండి బీజేపీలో చేరారని, త్వరలో జిల్లాలో కూడా బీజేపిలో పలువురు నాయకులు చేరబోతున్నారని పేర్కొన్నారు.

విపక్ష పార్టీలు, కూటమి వారు స్కాంలు చేసి జైళ్ళకు వెళుతున్నారని, రైతులకోసం, మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిన పార్టీ బీజేపీనేనని అన్నారు. టీడీపి,జనసేన, బీజేపీ కలిసి ఏపీలో కలిసి ముందుకు వెళుతున్నాయని, తెలంగాణలో కూడా అలాగే కలిసి ముందుకు వెళ్ళి బీజేపీని గెలిపిద్దామన్నారు. ఖమ్మం బీజేపీ అభ్యర్థి వినోదరావు దేశహితంగా, సమాజహితంగా పనిచేసే వ్యక్తి అని అన్నారు. ఆయనను గెలిపిస్తే జిల్లా ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈసమావేశంలో జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, రంగా కిరణ్,సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, నున్నా రవి, చావా కిరణ్, నాగేశ్వరరావు, శ్యామ్ రాథోడ్, అల్లిక అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

9నుంచి జమలాపురంలో బ్రహ్మోత్సవాలు

ఎర్రుపాలెం, మార్చి 29: తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి పొందిన ఖమ్మం జిల్లా ఎర్రెపాలెం మండలంలోని జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 9వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. యేటా నిర్వహించే క్షేత్ర సంప్రదాయమైన ఋగ్వేద వైదిక స్మార్త ఆగమనం ప్రకారం వచ్చే క్రోధి నామ సంవత్సర చైత్ర శుద్ధ పాడ్యమి(ఉగాది) నుంచి చైత్ర శుద్ధ నవమి(శ్రీరామ నవమి) వరకు 9 రోజుల పాటు ఏప్రిల్ 17 వతేది వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ తొమ్మిది రోజులు రోజుకొక వాహన సేవను నిర్వహించనున్నారు.

ఆయిల్‌ఫెడ్ ఎండీ బదిలీ ?

- ఉపముఖ్యమంత్రి భట్టికి ఓఎస్డీగా నియామకం

దమ్మపేట, మార్చి 29: ప్రభుత్వరంగ సంస్థ అయిన ఆయిల్‌ఫెడ్ ఎండీగా విధులు నిర్వహిస్తున్న సురేంద్ర బదిలీ అయినట్లు సమాచారం. బదిలీ అయిన సురేంద్రను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ(ఓఎస్డీ)గా ప్రభుత్వం నియమించినట్లు తెలిసింది. కొత్తగా ఆయిల్‌ఫెడ్ చైర్మన్‌గా ఐఏఎస్ అశోక్‌రెడ్డి వస్తున్నట్లు ఆయిల్‌ఫెడ్ వర్గాల ద్వారా విశ్వసనీయ సమాచారం .

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

పాల్వంచ, మార్చి 29: పేకాట స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. పాత పాల్వంచలోని ఓ రహస్య ప్రదేశంలో కొందరు పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం అందుకున్న పాల్వంచ పట్టణ పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఆరు సెల్ ఫోన్లు, మూడు ద్విచక్రవాహనాలు, రూ.47000 నగదు స్వాధీనం చేసుకున్నారు.

బెల్టు షాపులపై.. పాల్వంచ పట్టణ పరిధిలోని బొల్లోరిగూడెం ప్రాంతంలోని రెండు బెల్టు షాపులపై పోలీసులు దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిర్వహకులిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ బానాల రాము తెలిపారు.

తరావీహ్ నమాజ్‌లో... కంఠోపాటంగా ఖురాన్

- హాఫీజ్.. అజారుద్దీన్ ప్రత్యేకత


ఖురాన్ సారాంశం వినిపిస్తున్న అజారుద్దీన్

కల్లూరు, మార్చి 29: కల్లూరులోని జామే మసీదులో అజారుద్దీన్ అనే యువకుడు గత ఎనిమిది సంవత్సరాలుగా తరావీహ్ నమాజ్‌లో కంఠోపాటంగా ఖురాన్ వినిపిస్తూ ముస్లిం భక్తుల్లో ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందిస్తున్నాడు. ఖురాన్ గ్రంథం 30 ఖండాలుగా విస్తరించింది. దీనిని కంఠోపాటంగా వినిపించే వారిని హాఫీజ్ ఏ ఖురాన్ అంటారు. ఈ మాసంలో ప్రతీ రోజు రాత్రి ఇషా (తరావీహ్) నమాజ్‌లో ప్రత్యేకంగా ఒక గంట పాటు సారాంశం వినిపిస్తారు. ఇదే సమయంలో అలీం ఉర్దూలో అనువాదం చేస్తూ ఉపవాస దీక్షాధారులకు వినిపిస్తారు. ఆ సారాంశాన్ని భక్తులు గ్రహిస్తారు. మానవాళిని సన్మార్గంలో నడిపించేందుకు చెడుకు దూరంగా ఉంచేలా, కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరిలో ప్రేమ, దయ, కరుణ చూపించటమే ఈ ఖురాన్ గ్రంథం సారాంశం. ఈ రంజాన్ మాసాంతం ఉపవాస దీక్షాధారులతో మసీదులు ఆధ్యాత్మిక శోభతో వెల్లివిరుస్తున్నాయి.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ వేడుకలు

- 42మంది సీనియర్ నాయకులు, కార్యకర్తలకు సత్కారం
- ఎన్టీఆర్ రాజకీయ ప్రస్థానంపై ఫొటో ఎగ్జిబిషన్
- తెలుగు రాష్ట్రాలపై టీడీపీ ముద్రను కీర్తించిన నేతలు


ఎన్టీఆర్ చిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్

ఖమ్మం మామిళ్లగూడెం, మార్చి 29: తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ వేడుకలను నగరంలోని ఎన్టీఆర్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏన్కూరు ఎంపీపీ ఆరెం వరలక్ష్మి పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో టీడీపీ పార్లమెంట్ నాయకుడు కేతినేని హరీష్, వరలక్ష్మి మాట్లాడారు.

తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడాలన్న లక్ష్యంతో 43ఏళ్ల క్రితం ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పెను మార్పులను తీసుకొచ్చారన్నారు. అప్పటి వరకు కాంగ్రెస్ పాలనతో విసుగుపొందిన ప్రజలు టీడీపీని ఆదరించారని అన్నారు. ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా పరిపాలనను ప్రజల చేరువ చేసిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు, లోకేష్‌బాబు పార్టీని ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. తెలుగు ప్రజలు ఈ ఎన్నికల్లో ఏపీలో తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టాలని కోరారు. తెలుగు ప్రజలు ఉన్నంత కాలం తెలుగుదేశం పార్టీ ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 42మంది సీనియర్ నాయకులు, కార్యకర్తలను హరీష్ ఘనంగా సత్కరించారు. అలాగే ఎన్టీఆర్ రాజకీయ ప్రస్థానంపై చిత్ర ప్రదర్శనను ప్రారంభించారు. కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో ఎన్టీఆర్ చిత్రాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో మందపల్లి రజిని, ప్యారీస్ వెంకన్న, కోటి రామారావు, మోరంపూడి రవి, కూచిపూడి జై, కన్నేటి పృథ్వీ, నాగళ్ల లక్ష్మణ్, చింతనిప్పు నాగేశ్వరరావు, నల్లమల శ్రీను తదితరులు పాల్గొన్నారు. బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు కూడా వేడుకల్లో పాల్గొని ప్రసంగించారు.


కొత్తగూడెం సీఎస్ఐ సెయింట్ ఆండ్రూస్ చర్చిలో గుడ్ ఫ్రైడే ఆరాధనలో పాల్గొన్న క్రైస్తవులు

క్షమాగుణంతో జీవించాలి

- గుడ్ ఫ్రైడే ప్రార్థనలలో భక్తులకు సందేశమిచ్చిన దైవ సేవకులు
- రేపు యేసు పునరుత్థాన రోజు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి29: ప్రతి ఒక్కరు లోక రక్ష కుడైన యేసుక్రీస్తు మాదిరిగానే క్షమాగుణం కలిగి ఉండి జీవించాలని, ఆయన చూపిన మార్గంలోనే పయనిస్తూ పొరుగు వారిపై ప్రేమానురాగాలను ప్రదర్శించాలని కొత్తగూడెం సీఎస్ఐ సెయింట్ ఆండ్రూస్ చర్చి పాస్టేట్ ఛైర్మన్ భీమాల అభిజిత్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం సీఎస్ఐ చర్చిలో గుడ్ ఫ్రైడే (శుభశుక్రవారం) ప్రత్యేక ఆరాధనలను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపవాస దీక్షలను ముగిస్తూ భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ యేసు క్రీస్తు మానవాళి పాప పరిహారార్థం ఎన్నో త్యాగాలు, అవమానాలను భరించారని గుర్తు చేశారు. ప్రజలందరిని పాపం నుంచి రక్షించడం కొరకు యేసు క్రీస్తు సిలువపై తన ప్రాణాలను విడిచారని తెలిపారు. సీఎస్ఐ, ఆర్సీఎం, పలు చర్చిలలో క్రైస్తవులు వీధుల్లో ప్రదర్శన చేసి యేసుక్రీస్తును గుర్చి ప్రకటించారు. క్రీస్తు సిలువ వేసి పునరుత్థానం జరిగిన సంఘటన ఆధారంగా ఈస్టర్ పర్వదినాన్ని ఆదివారం తెల్లవారుజామున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం సీఎస్ఐ సహాయ గురువులు పాస్టేట్ కమిటీ సెక్రటరీ కె.జాన్‌రవీందర్‌కుమార్, ట్రెజరర్ సాల్మన్‌రాజు, కమిటీ సభ్యులు, స్త్రీల మైత్రి, సండేస్కూల్, యూత్ సభ్యులు, క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

ఖమ్మం సాంస్కృతికం, మార్చి 29: గుడ్ ఫ్రైడే వేడుకలను శుక్రవారం క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఖమ్మం నగరంలోని వైరా రోడ్‌తోపాటు జిల్లాలోని తల్లాడ, వైరా, కల్లూరు, మధిర, కొణిజర్ల తదితర ప్రాంతాల్లో క్రైస్తవులు యేసు ప్రభువు శిలువ యాత్ర సన్నివేశాలను నిర్వహించారు. యేసు ప్రభువు పాత్రధారులు శిలువను మోస్తూ ప్రదర్శనలో పాల్గొన్నారు. యేసు దీక్ష వహించిన విశ్వాసులు దీక్ష దుస్తులు, జపమాలలు ధరించారు. పలుచోట్ల ప్రభువు శిలువ సన్నివేశాలు చూపరుల కళ్లను చమర్చేలా చేశాయి.


ఖమ్మంలో శిలువ యాత్ర

భద్రాద్రి, పర్ణశాలకు సరికొత్త రూపు

- ఆధ్యాత్మిక, పర్యాటక అభివృద్ధికి ఊతం
- ప్రాచీన నిర్మాణాలను పరిరక్షిస్తూనే అభివృద్ధి పనులు
- భక్తులకు మౌలిక సదుపాయాలపై ప్రధాన దృష్టి
- పరిశీలించిన దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్

భద్రాచలం, మార్చి 29: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా, పర్యాటక కేంద్రంగా భాసిల్లుతున్న భద్రాచలం, పర్ణశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టి సరికొత్త రూపు తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. ఈ మేరకు రాష్ట్ర దేవాదాయ, పర్యాటక శాఖల ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, పర్యాటక శాఖ ఎండీ రమేష్‌నాయుడు శుక్రవారం పర్ణశాల, భద్రాచలంలో పర్యటించారు. వీరికి భద్రాద్రి జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్, భద్రాచలం ఆర్డీవో కె.దామోదర్‌రావు, దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి సహకారం అందించారు.

హైదరాబాద్ నుంచి వచ్చిన ఉన్నతాధికారులు తొలుత భద్రాద్రి దేవస్థానం అనుబంధ ఆలయమైన దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాలకు వెళ్లి అక్కడ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇదే సమయంలో పర్యాటక శాఖ భక్తుల సౌకర్యార్థం చేపట్టే పనులకు స్థల సమస్య కూడా లేకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా అధికార యంత్రాంగం తరఫున కలెక్టరు భరోసా ఇచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో పర్ణశాల ఆలయ ప్రాంగణం, సీతాకుటీరం, నార చీరల ప్రాంతాలను పరిశీలించిన ఉన్నతాధికారులు భక్తులు మెచ్చే రీతిలో పనులు చేపట్టాలని అధికారులకు సూచించినట్లు తెలిసింది.

ఆధ్యాత్మిక, పర్యాటక అభివృద్ధి

భద్రాచలంలో రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తూర్పు, దక్షిణం, పడమర వైపున ఒకటిన్నర నుంచి రెండు ఎకరాల వరకు స్థల సేకరణ చేయాలని భావిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కోడ్ ఉండటంతో అధికారులు అధికారికంగా ఎటువంటి వ్యాఖ్యలు చేయనప్పటికీ ప్రధానంగా ఆధ్యాత్మిక, పర్యాటక రంగానికి త్వరలో చేపట్టే అభివృద్ధి పనులు ఊతమిచ్చేలా ఉండాలని ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు వినికిడి. ప్రధానంగా భద్రాద్రి రామాలయ అభివృద్ధిపై ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు స్పష్టతనివ్వడంతో ఇందుకు సంబంధించి ప్రాథమిక కసరత్తు ఇప్పటికే ప్రారంభమైంది. ఇదే క్రమంలో ప్రభుత్వం తాజాగా చేపట్టే అభివృద్ధి పనుల కోసం 50ఇళ్ల తొలగించాల్సి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఇవే అంశాలను ఉన్నతాధికారులకు జిల్లా అధికారులు నివేదించినట్లు వినికిడి. భద్రాచలంలో మిథిలా స్టేడియం పక్కన, అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రసాద్ పథకం ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులను సైతం రాష్ట్ర అధికారులు పరిశీలించారు.


రామాలయాన్ని పరిశీలిస్తున్న ముఖ్య కార్యదర్శి, కమిషనర్‌లు

రామాలయంలో ప్రత్యేక పూజలు

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, పర్యాటక శాఖ ఎండీ రమేష్‌నాయుడు, జిల్లా కలెక్టర్ ప్రియాంక, ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్, భద్రాచలం ఆర్డీవో కె.దామోదర్‌రావులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం తరఫున జ్ఞాపిక, శాలువ, స్వామి వారి ప్రసాదం వారికి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, వైదిక సిబ్బంది అందజేశారు.

‘ప్రసాద్’ స్థలమార్పిడి అవకాశాల పరిశీలన

దుమ్ముగూడెం, మార్చి 29: ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాల రామాలయం పరిసరాల్లో ‘ప్రసాద్’ పథకంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల స్థల మార్పిడి అవకాశాలను దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు శుక్రవారం పరిశీలించారు. రూ.5కోట్ల నిధులతో ఉన్నతపాఠశాల, నారచీరలు, ఆలయాల వద్ద అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులు తొలుత భావించారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మాణ పనులతో పాఠశాల ఎదురుగా ఉన్న దేవస్థానం భూమిలో చేపట్టేందుకు అడ్డంకి ఏర్పడడంతో ప్రసాద్ పనులు వాయిదా పడ్డాయి. దీంతో పాఠశాల వెనుక ప్రాంతంలో చేపట్టేందుకు స్థలాన్ని సేకరించారు.

ఉన్నత పాఠశాల వెనుక భాగంలో పది షాపులు, రెస్టారెంట్, కిచెన్ స్టోర్, సీసీ కెమేరాల మానిటరింగ్‌తో పోలీసు సహాయక గది, నారచీరల ప్రాంతంలో ఫుట్ బ్రిడ్జి, రెయిన్ షెల్టర్, టాయిలెట్లు, ఆలయం వద్ద మరికొన్ని నిర్మాణాలను చేపట్టేందుకు తెలంగాణా టూరిజం శాఖ ప్రతిపాదనలను సిద్ధం చేసింది. పనులకు ఆటంకం కలిగిన పరిస్థితులను మ్యాపు సహాయంతో సీతమ్మ సాగర్ ప్రాజెక్టు డీఈ రాంబాబు ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషన్, కలెక్టర్‌కు వివరించారు. ఆలయ పరిసరాల్లోని సందర్శ ప్రాంతాల్లో సీతారామచంద్రస్వామి వారి చరిత్రను తెలిపే విధంగా తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో ప్రత్యేకమైన బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీ ఈవో రమాదేవికు సూచించారు.

అసౌకర్యానికి గురైన ప్రిన్సిపల్ సెక్రటరీ

పర్ణశాలలో బాపు నూతన కుటీరాన్ని సందర్శిస్తున్న సమయంలో ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కలెక్టర్ ప్రియాంక తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఆలయ సంప్రదాయం ప్రకారం గుడి పరిసరాల్లో చెప్పులతో తిరగకూడదనే నిబంధన ఉంది. కుటీరం చుట్టూ టైల్స్ వేసినా.. నడిచే దారి బాగా వేడెక్కడంతో ఇద్దరు అధికారులు ఆ ప్రాంతంలో నడవలేక ఒక్కసారిగా పరుగుపెట్టారు. కొంత సేపు ఇబ్బందికి గురయ్యారు. ఆ ప్రాంతంలో వెంటనే మ్యాట్ వేయించాలని ఈవోను ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశించారు.


మ్యాపును పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ

ఆళ్లపల్లి అడవుల్లో కార్చిచ్చు

- చెలరేగుతున్న మంటలు
- తీగజాతి వృక్షాలు, మొక్కలు, జీవరాసులు ఆహుతి
- తునికాకు టెండర్‌దారులపైనే అనుమానాలు

ఆళ్లపల్లి, మార్చి 29: పచ్చని చెట్లు నిలువునా కాలిపోతున్నాయి. అడవుల్లో అగ్నికీలలు వ్యాపిస్తున్నాయి. వారం రోజులుగా ఆళ్లపల్లి, గుండాల, కరకగూడెం, పినపాక, మణుగూరు, టేకులపల్లి పరిసర అటవీప్రాంతాల్లో నిత్యం కార్చిర్చు రగులుతోంది. అయితే ప్రకృతి సిద్ధంగా కాకుండా.. కొందరు కావాలనే మంటలు పెట్టి అడవిని నాశనం చేస్తున్నారని తెలుస్తోంది. అడవుల్లో ప్రూనింగ్ పనులు లేకపోవడంతో తునికాకు సేకరణ పేరుతో కాంట్రాక్టర్లు అగ్గిపెట్టారనే విమర్శలు వస్తున్నాయి. రహస్యంగా కొందరిని ఏర్పాటు చేసుకుని అడవిలో మంటలు పెట్టేందుకు అగ్గిపెట్టెలు, ఆయిల్, ఇతర ఖర్చులు సమకూర్చినట్లు విశ్వసనీయ సమాచారం.



అడవుల్లో చెలరేగుతున్న మంటలు

ఆకురాలే కాలంతో మంటలు ఒక చోట పెడితే అంతట వ్యాప్తి చెందుతాయి. దాంతో ఆయా మంటల్లో తునికాకు మొక్కలతో పాటు, చిన్న మొక్కలు, తీగజాతి వృక్షాలు, వంటచెరుకు, మంటలకు కాలీ బూడిద అవుతున్నాయి. పక్షులు, జంతువులు, నేలపై పాకే జీవరాసులు, కోతులు పొగ, వేడికి విలవిల్లాడుతున్నాయి. వేడికి తట్టుకోలేక జంతువులు పోడు భూములు, గ్రామ పొలిమేరల్లోకి రావడంతో వేటగాళ్లకు అదునుగా మారుతోంది. మంటలు వ్యాపించడంతో వాతావరణంలో పొగ పేరుకుపోయి కళ్ల మంటలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. అడవుల్లో మంటలు రాజేయడం పట్ల కలిగే ఇబ్బందులపై గిరిజన ప్రాంత జనాలకు అవగాహన కల్పించకపోవడంతో అడవులు మంటల పాలవుతున్నాయి.

హరితహారంలో నాటిన మొక్కలకు రెట్టింపుగా అడవుల్లో మొక్కలు బూడిదవుతున్నాయి. ఇలా ప్రతీ సంవత్సరం అడవులు కాలిపోవడం పరిపాటిగా మారింది. కాని పూర్తిస్థాయిలో మాత్రం పరిష్కారం కాకపోవడంతో ప్రతీ ఏడాది వేల సంఖ్యల్లో ఔషధ మొక్కలతో పాటు, ఇతర మొక్కలు, జీవరాసులు మంటలకు బలైపోతున్నాయి.

తరుముకొస్తున్న తాగునీటి ఎద్దడి

- వైరా రిజర్వాయర్‌లో తగ్గుతున్న నీటిమట్టం
- 11 మండలాలకు పొంచిఉన్న తాగునీటి సమస్య


నీటిమట్టం తగ్గిపోయిన వైరా రిజర్వాయర్

వైరా, మార్చి 29: వైరా రిజర్వాయర్‌లో రోజురోజుకు నీటిమట్టం అడుగంటి పోతుంది. దాంతో తాగునీటి సమస్య ముంచుకొస్తుంది. ఎండలు ఇదే రీతిలో ఉంటే కొద్దిరోజుల్లోనే తాగునీటి ప్రమాదం ఏర్పడనుంది. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 10.6అడుగుల నీటిమట్టం ఉంది. పూర్తిస్థాయి నీటిమట్టం 18.3అడుగులు కాగా ఇప్పుడు అది దాదాపు 8అడుగులకు తగ్గిపోయింది. వైరా రిజర్వాయర్‌లోని నీటి లభ్యతతో ఇక్కడ 11మండలాలకు తాగునీరు అందించేందుకు మిషన్ భగీరథ పథకాన్ని నిర్మించారు. కేసీఆర్ ప్రభుత్వం మిషన్ భగీరథను నిర్మించకముందే బోడేపూడి సుజల ప్రవంతి ద్వారా వైరా, బోనకల్, మధిర, ఎర్రుపాలెం మండలాలకు అలాగే కొణిజర్ల, తల్లాడ మండలాలకు రెండు వేర్వేరు పథకాల నుంచి దాదాపు 20ఏళ్లుగా రిజర్వాయర్ నుంచి తాగునీరు సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ నిర్మించిన తర్వాత ఈ ఆరుమండలాలతోపాటు మరో ఐదు మండలాలకు ఇక్కడి నుంచి తాగునీరు సరఫరా చేస్తున్నారు. నిత్యం కోట్ల లీటర్ల తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే ఇప్పుడు తీవ్ర ఎండలతో నీటిమట్టం గణనీయంగా తగ్గిపోతుంది. రిజర్వాయర్‌లో మిషన్ భగీరథ అవసరాల కోసం 14అడుగుల నీటి లభ్యత ఉండేలా గత ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే రైతులు ఇతర అవసరాల దృష్ట్యా 13అడుగుల మేర నీటి లభ్యత ఉన్నప్పటికీ అది ఎండల కారణంగా ఆవిరైపోతూ తగ్గిపోతుంది. ఇంకా వేసవికాలం మరో మూడునెలలు ఉన్నందున అప్పటికీ రిజర్వాయర్ నీటిమట్టం పూర్తిగా అడుగంటే ప్రమాదముంది. గత ప్రభుత్వం వేసవి కాలంలో మిషన్ భగీరథ అవసరాల నిమిత్తం సాగర్‌జలాలతో రిజర్వాయర్‌ను నింపుతామని ప్రకటించినప్పటికీ ఈ ఏడాది నాగార్జున్ సాగర్‌లో కూడా నీళ్ల లేకపోవడంతో అక్కడి నుంచి చుక్కనీరు కూడా వచ్చే అవకాశం కన్పించటం లేదు. ఈ ప్రాంతంలోని బోర్లు, బావుల్లో భూగర్భజలాలు అడుగంటాయి. అవసరాల మేరకు కూడా నీళ్ల ఉండటం లేదు. చెరువులు, కుంటలు, వాగులు, ఏర్లు ఇప్పటికే పూర్తిగా ఎండిపోయాయి. పశువులకు కూడా నీటి ఎద్దడి ఏర్పడింది. రానున్న మూడు నెలల వేసవికాలాన్ని తాగునీటి ఎద్దడి లేకుండా ఎలా అధిగమించాలోనని అధికారులు తీవ్ర హైరానా పడుతున్నారు.

ఖమ్మంలో టీయూడబ్ల్యుజే రాష్ట్ర మహాసభల ఏర్పాటుకు సన్నాహాలు

- ముఖ్య అతిథిగా రానున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి 29: టీయూడబ్ల్యుజే (ఐజేయూ) మూడో రాష్ట్ర మహాసభ లు మే చివరి వారంలో ఖమ్మంలో ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. టీయూడబ్ల్యు జే (ఐజేయూ) రాష్ట్ర నాయకత్వం జిల్లా కమిటీకి సభల ఏర్పాటుకు అనుమతిచ్చింది. దీంతో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాంనారాయణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వేంకటేశ్వర్లు, ఏనుగు వేంకటేశ్వర రావుతో పాటు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల తో సమావేశం నిర్వహించి మహాసభలు ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటినుంచే కార్యాచరణ చేపట్టాలని సూచిం చారు. ఈమహాస భలకు ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అతిధులుగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సమాచార, రెవెన్యూ, గృహని ర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వ్యవసా యశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, పలు పార్టీలకు చెందిన నేతలు హాజరవుతారన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టుల ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సమస్యలతో పాటు ఇళ్లస్థలాలు, హెల్త్‌కార్డులు తదితరు సమస్యలను రాష్ట్ర మహాసభల్లో చర్చించి, నిర్ణయాలు తీసుకుంటామని రాంనారాయణ తెలిపారు. రాష్ట్ర మహాసభలు ఖమ్మంలో ఘనంగా నిర్వహిస్తున్నం దున జిల్లా జర్నలిస్టులు మహాసభల నిర్వహణకు భాగస్వామ్యం జరుగుతుం దని తెలిపారు. రాష్ట్ర విభజన తరువాత ఖమ్మంలో జర్నలిస్టు మహాసభలు తొలిసారిగా జరగనుండటంతో టీయూడబ్ల్యుజే-ఐజేయూ మహాసభల నిర్వహణను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది.

చిటికెలో వాతావరణ సమాచారం

- కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 'పంచాయత్ మౌసం సేవా' యాప్
- గూగుల్ ప్లేస్టోర్‌లో ఉచితంగా లభ్యం



ఖమ్మం వ్యవసాయం, మార్చి 29: కాలం ఏదైనా ఆరోజు వాతావరణ పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవడం చాలా ముఖ్యం. వాతావరణ సమాచారాన్ని ప్రతిఒక్కరి దైనందిన కార్యకలాపాల్లో భాగం చేయాలనే ఉద్దేశంతో భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఇటీవల 'పంచాయత్ మౌసం సేవా' మొబైల్ యాప్ విడుదల చేసింది. 'ప్రతిచోటా వాతావరణం.. ఇంటింటికీ వాతావరణం' పేరుతో ఈ కొత్త సేవను 12 భారతీయ భాషల్లో దేశవ్యాప్తంగా ప్రారంభించింది. ఎప్పటికప్పుడు గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు, గాలి పవనాల వేగం, తేమశాతం, వర్షపాతం, పిడుగుపాటు, తుపాను హెచ్చరికలు, సూర్యోదయం, సూర్యాస్తమయం వంటి సమాచారాన్ని ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. ప్రస్తుతం ఎండలు మండిపోతుండటం, రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు, వడగాల్పులు పెరగనుండటంతో ప్రజలు తాజా వాతావరణ ముందస్తు సమాచారాన్ని తెలుసుకోవచ్చు.

24 రకాల వాతావరణ సమాచారం

'పంచాయత్ మౌసం సేవా' మొబైల్ యాప్‌ను ప్లేస్టోర్ ద్వారా మొబైల్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. లాగిన్ అయి రాష్ట్రం, ప్రాంతం పేరును లేదా పిన్‌కోడ్, అక్షాంశ, రేఖాంశాలను తెలపాలి. వాతావరణ అంశాలను ప్రత్యేకంగా రంగుల(పిక్టోరియల్)తో రూపొందించడం వల్ల సాధారణ ప్రజలు, రైతులకు ఈ యాప్ ద్వారా సమాచారం సులువుగా అర్థం అవుతుంది. ఆంగ్లం, హిందీ సహా 12 భారతీయ భాషల్లో తాజా సమాచారం అందుతుంది. 24 రకాల వాతావరణ సమాచారం, సూచనలను ఈ యాప్‌లో పొందుపరిచారు. ఇందులోప్రజలకు మొదటి ప్రాధాన్యం ఇచ్చారు. దీంతోపాటు రైల్వే, జాతీయ రహదారులు, విమానయానం, రక్షణ, నేవీ, టూరిజం, ఆరోగ్యం, నదులు, వాటి స్థితిగతులు, సీజనల్ వాతావరణం, మార్పులు, చేర్పులు వంటి వాటి గురించి తెలుసుకోవచ్చు.

ప్రతీ రైతుకు చేరువలో..

'పంచాయతీ వాతావరణ సేవ' ద్వారా మౌసం యాప్‌ను దేశంలోని ప్రతి గ్రామంలో అయిదుగురు రైతులతో అనుసంధానం చేయాలనే లక్ష్యంగా భారత వాతావరణ విభాగం అధికారులు ఈ యాప్‌ను విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఐఎండీ ఈ ఏడాది జనవరి 16న దేశంలోని అన్ని వాతావరణశాఖ కార్యాలయాల్లో ఈ యాప్‌ను ప్రారంభించింది. ఈ ఏడాదంతా విద్యార్థులు, ప్రజలు, రైతులకు ప్రదర్శనలు, కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తోంది.

కేంద్రీయ విద్యాలయంలో ఒకటో తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం స్పోర్ట్స్, మార్చి 29: ఖమ్మం నగరంలోని కరుణగిరి ప్రాంతంలో గల కేంద్రీయ విద్యాలయ్ సంఘటన్ పాఠశాలలో 2024-25 సంవత్సరానికి ఒకటో తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కవీంద్రరాయ్ తెలిపారు. ఒకటో తరరగతిలో చేరే విద్యార్థులు మార్చి 31, 2024 నాటికి 6 సంవత్సరాలు నిండి 8 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. ఆసక్తి గల వారు ఏప్రిల్ 1 నుంచి 15 తేదీ సాయంత్రం 5 గంటల వరకు www.kvsonlineadmission.kvs.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కాగా రెండో తరగతిలో ఖాళీలకు త్వరలో నోటిఫికేషన్ ఇస్తామన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు గిరిజన విద్యార్థి


సుమాంజలి

గుండాల, మార్చి 29: గుండాల మండలం కాచనపల్లి గ్రామానికి చెందిన యనగంటి సుమాంజలి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. యనగంటి సుమాంజలి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. ఈ నెల 31 నుంచి బీహార్ రాజధాని పాట్నాలో జరిగే 33వ సబ్‌జూనియర్ జాతీయస్థాయి కబడ్డీ పోటీలలో తెలంగాణ రాష్ట్రం తరఫున పాల్గొనేందుకు ఎంపిక అయినట్లు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కే జగదీశ్వర్ ప్రకటించారు. సుమాంజలికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు. . .

అనారోగ్యంతో సినీ కళాకారుడు వీరభద్రం కన్నుమూత


వీరభద్రం (ఫైల్)

మధిర, మార్చి 29: రంగస్థల నటుడు, టీవీ, సినీ కళాకారుడు దూదిపాళ్ల వీరభద్రం(72) మధిరలోని తన స్వగృహంలో అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మృతిచెందారు. మూడుదశాబ్దాల క్రితమే మధిరలో ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేసిన వీరభద్రం కళారంగంపై మక్కువతో టీవీ, సినీ కళాకారుడుగా హైదరాబాద్ వెళ్లి స్థిరపడ్డారు. అనేక టీవీ సీరియల్స్‌లో, సినిమాల్లోనూ అనేక పాత్రల్లో నటించి అనేక అవార్డులు గెలుచుకున్నాడు. ఆరు నెలల క్రితం ఇంట్లో కిందపడటంతో తలకు బలమైన గాయమైంది. రెండునెలలు హైదరాబాద్‌లోనే చికిత్స తీసుకున్నా తగ్గలేదు. నాలుగు నెలలుగా ఖమ్మంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స తీసుకొన్నారు. అయినా తగ్గకపోవడంతో డాక్టర్ల సలహాల మేరకు వారం క్రితం మధిరలోని ఆయన స్వగృహానికి వచ్చారు. అనారోగ్యం మెరుగుపడకపోవడంతో శుక్రవారం ఉదయం 10గంటల సమయంలో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వీరభద్రానికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. గతంలో ఒక కుమారుడు, కుమార్తె ప్రమాదాల్లో మృతి చెందారు.

సత్తుపల్లిలో వరుస చోరీలు

- వేలిముద్రలు సేకరించిన క్లూస్‌టీమ్

సత్తుపల్లిరూరల్, మార్చి 29: సత్తుపల్లి పట్టణంలోని వేంసూర్ రోడ్‌లో ఒకేరోజు మూడుచోట్లా వరుస చోరీలు చోటుచేసుకున్నాయి. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత కొందరు గుర్తుతెలియని వ్యక్తులు డీసీసీబీ మెయిన్ బ్రాంచ్ వెనుక ఉన్న సత్తుపల్లి సొసైటీ కార్యాలయం తాళం పగులకొట్టిన అనంతరం ఏమీ లేకపోవడంతో పైనున్న మరో కార్యాలయంలో తాళం పగులకొట్టి లోనికి వెళ్లారు. అక్కడ బీరువాను తెరిచి చూడగా విలువైన పత్రాలు తప్పిస్తే డబ్బులు కనిపించలేదు. అదే కార్యాలయం కిందనున్న రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ షోరూం వెనుక షట్టర్ తాళాలు పగులకొట్టి లోనికి ప్రవేశించారు. ఆఫీస్ రూమ్‌లోకి అద్దాలు పగులకొట్టి క్యాష్ కౌంటర్‌లోని సుమారు రూ.10వేల నగదును తీసుకుని ఎదురుగా ఉన్న అన్నపూర్ణ భోజన హోటల్‌లోకి కుడివైపు షట్టర్ పగులకొట్టి కౌంటర్ వద్దకు చేరుకున్నారు. అక్కడ కూడా సుమారు రూ.10వేలకు పైగా నగదును కాజేసినట్లు బాధితులు తెలిపారు. ఈ రెండు చోట్లా సీసీ కెమెరాలో తమ ఫుటేజీ రికార్డు అవుతుందనే ఉద్దేశ్యంతో డీవీఆర్‌ను ఎత్తుకెళ్లిపోగా సత్తుపల్లి పోలీసులకు ముగ్గురు బాధితులు ఫిర్యాదు చేశారు. ఖమ్మం క్లూస్ టీమ్ సీఐ బోడా నరేష్ తన సిబ్బందితో మూడుచోట్లా వేలిముద్రలను సేకరించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ టీ.కిరణ్ తెలిపారు.

తాళం పగలగొట్టి చోరీ

ఖమ్మం క్రైం, మార్చి 29: ఓ ఇంటి తాళం పగలగొట్టి బంగారం చోరీ చేసిన సంఘటన శక్రవారం సాయంత్రం ఖమ్మం నగరంలో జరిగింది. ఖమ్మం నగరంలోని వీడియోస్‌కాలనీలో నివాసం ఉండే గోళ్లమూడి శ్రావణ్ పెట్రోల్ బంక్‌లో విధులు నిర్వహిస్తుంటాడు. శుక్రవారం సాయంత్రం అతని భార్య ఇంటికి తాళం వేసి వాకింగ్ వెళ్లింది. తిరిగి వచ్చి చూడగా తాళం పగలగొట్టి ఉంది. దీంతో ఇంట్లో చూడగా బీరువాలోని సుమారు రూ.1.50లక్షల విలువైన బంగారం చోరీకి గురైంది. ఈఘటన పై గోళ్లమూడి శ్రావణ్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

పోలీసుల అదుపులో చోరీ నిందితులు?

మణుగూరు/బూర్గంపాడు మార్చి 29: మండల పరిధిలోని సంజీవరెడ్డి పాలెం గ్రామ శివారులో గురువారం రాత్రి చోరీకి యత్నించిన ఇరువురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంజీవరెడ్డి పాలెం గ్రామ శివారున గల కర్మాగారంలో వీరు చోరీకి పాల్పడేందుకు వెళ్లారు. అదే సమయంలో పొలం వద్ద ఉన్న రైతులు వారిని గమనించి పోలీసులు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చోరీకి యత్నించే వారిని అదుపులోకి తీసుకున్నారు. కర్మాగారంలోని ఓ పరికరాన్ని ఆటో ద్వారా వీరు తరలించేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఈ విషయంపై పోలీసులు వివరణ కోర గా ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు తమకు అందలేదన్నారు. పట్టు బడిన ఇరువురు యువకులు మొరం పల్లి బంజరకు చెందిన వారిగా తెలిసింది.

ఉమ్మడి జిల్లాను ప్రైవేటు కంపెనీలకు కేటాయించవద్దు

- ప్రభుత్వానికి ఆయిల్‌పామ్ రైతుల విజ్ఞప్తి


సమావేశమైన నాయకులు

అశ్వారావుపేట, మార్చి 29: ఆయిల్‌పామ్ సాగు అత్యధికంగా ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ప్రైవేటు కంపెనీలకు కేటాయించవద్దని టీఎస్ ఆయిల్‌పామ్ రైతు సంఘ అధ్యక్షుడు ఆలపాటి రామచంద్ర ప్రసాద్ తదితర రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండలంలోని నారంవారిగూడెం ఆయిల్ పామ్ నర్సరీలో తెలంగాణ ఆయిల్‌పామ్ రైతులు సమావేశమై ఆయిల్‌పామ్ ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అతి తక్కువగ విస్తీర్ణం కలిగిన 8 మండలాలలో ప్రైవేటు కంపెనీ పరిధిలో ఉందని, వాటిని కూడ ప్రభుత్వ పరిధిలోని ఆయిల్‌ఫెడ్ సంస్థకు కేటాయించాలని రైతులు కోరారు. రైతులు మాట్లాడుతూ ఆయిల్‌పామ్ ధర పార్ములా నిర్ణయంలో గడిచిన మూడేళ్ల గరిష్టాన్ని పరిగణనలోనికి తీసుకొని పర్సంటేజ్‌ను ప్రకటించాలని కోరారు. మార్కెట్‌లో ఆయిల్ విక్రయాలు ఆధారంగ గెలల ధర నిర్ణయించంలో ఎటు వంటి అభ్యంతరం లేదని, పర్సింటేజ్ ప్రకటనలో ఆయిల్ పామ్ రైతు సంఘం డిమాండ్ ను పరిగణనలోనికి తీసుకోవాలని సూచించారు. దీనివల్ల ఆయిల్‌పామ్ రైతులకు టన్ను గెలల స్వల్పంగ ధర పెరిగే అవకాశం ఉంటుందని, కనీస భరోస పామాయిల్ రైతులకు లభిస్తుందన్నారు. లేని పక్షంలో పెరిగిన ధరలతో రైతులు ఆర్ధికంగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేసారు. పామాయిల్ రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సంఘం విజ్ఞప్తికి ప్రభుత్వం సానుకూలంగ స్పందించాలని కోరారు. సమావేశంలో సంఘ ప్రదాన కార్యదర్శి కోటగిరి సీతారామస్వామి, జేకేవీ రమణారావు, బండి భాస్కర్, మెగళ్లపు చెన్నకేశవరరావు, బుద్దే కోటేశ్వరరావు, కెవీ సత్యనారాయణ, మురళి, మలిరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, అంకత మహేశ్వరరావు, దొడ్డ ప్రసాద్, ఎర్ర వసంతం పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు పూర్తిచేయాలి

- కలెక్టర్ గౌతమ్
- లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ కేంద్రం సీపీతో కలిసి పరిశీలన


ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ

ఖమ్మం రూరల్, మార్చి 29: రానున్న లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ కేంద్ర ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలను సీపీ సునీల్‌దత్‌తో కలిసి శుక్రవారం సందర్శించారు. పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్‌లను, రిసెప్షన్ కేంద్ర ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్ల వారిగా స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ ఏర్పాట్లకు సంబంధించి అధికారులకు సూచనలు చేశారు. కొత్తగా నియమిస్తు న్న రెండో అంతస్తులో స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ రూమ్‌లు అనువుగా చూసుకోవాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లకు కిటికీలు, ఉండకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. భద్రతా పార్కింగ్ ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎన్నికల నిర్వహణ సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎండాకాలం దృష్ట్య విద్యుత్తు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వాడిన ఫెన్సింగ్ తిరిగి ఉపయోగించాల న్నారు. 7 అసెంబ్లీ సెగ్మెంట్లు పోస్టల్ బ్యాలెట్‌లకు గదులు సిద్ధం చేయాలన్నారు. అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లకు అలారం ఏర్పాటు చేయాలని, ఎంపీడీఓలు తమ తమ మండలాల పరిదిలో ఎన్నికల సంబంధ అన్ని ఏర్పాట్లుపై బాధ్యతలు చేపట్టాలన్నారు. ఈవీఎంల రవాణా పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రిసెప్షన్ కేంద్రంలో రెయిన్ ప్రూఫ్ టెంట్ ఏర్పాట్లు చేయాలన్నారు. ఒకే భవనంలో 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన కౌంటింగ్ జరగనున్నందున ఏ సెగ్మెంట్‌కు సంబంధించిన ఈవీఎంలు ఆసెగ్మెంట్‌కు వెళ్లేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈవీఎంల తరలింపు సిబ్బందికి నియోజకవర్గాల వారీగా కలర్ కోడ్‌తో టీషర్టులు ఇవ్వాలని సెగ్మెంట్ల పేరు వాటిపై ప్రింట్ చేయించాలన్నారు. సెగ్మెంట్‌లకు సంబంధించి నామ సూచికలు, బ్యానర్లు, స్టిక్కర్లు, రూట్‌మ్యాప్‌లు తదితర అన్నింటిపై ఆయా సెగ్మెంట్‌కి కేటాయించిన రంగునే వాడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, శిక్షణా కలెక్టర్ మయాంక్ సింగ్, యువరాజ్, శిక్షణ ఐపీఎస్ మౌనిక, ఏసీసీ ఎం.రాజేశ్వరి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆగిఉన్న టిప్పర్‌ను ఢీ కొట్టిన ఆటో

- యువకుడి మృతి..
- మరో ముగ్గురికి గాయాలు



ఘటన స్థలంలో గోపి మృతదేహం, నుజ్జునుజ్జైన ఆటో

చింతకాని, మార్చి 29: ఆగి ఉన్న టిప్పర్‌ను ఆటో వెనుక నుంచి ఢీ కొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలు, ఇద్దరికి స్వల్ప గాయాలైన ఘటన మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామంలో ఖమ్మం-బోనకల్ రోడ్డుపై శుక్రవారం రాత్రి జరిగింది. 108 సిబ్బంది, పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం నగరం అగ్రహారం గ్రామానికి చెందిన తోట గోపి చింతకాని మండలం జగన్నాథపురం గ్రామంలో అమ్మమ్మ ఇంటి వద్ద నివాసం ఉంటు ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. రోజులాగే ఖమ్మంలో ఆటో నడుపుకున్న అనంతరం ముగ్గురు ప్రయాణికులను ఎక్కించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా పందిళ్లపల్లి గ్రామంలో ఆగి ఉన్న టిప్పర్‌ను వెనుక నుంచి వేగంగా ఢీకొట్టడంతో ఆటో నడుపుతున్న తోట గోపి(23) తలకు తీవ్ర గాయాలైనవి, మరో వ్యక్తి వీర్ల మహేష్‌కు తీవ్రగాయాలవ్వగా ఆటోలో ఉన్న లింగం నాగరాజు, లింగం మహేష్‌రాజు స్వల్ప గాయాలైనవి. సమాచారం అందుకున్న ఎస్ఐ షేక్ నాగుల్‌మీరా సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో ఎక్కించారు. 108 సిబ్బంది రామకృష్ణ, గోపాలకృష్ణలు క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందిస్తుండగా మార్గమధ్యంలో గోపి మృతిచెందాడు. వీర్ల మహేష్‌ను ఖమ్మంలోని ఆసుపత్రికి తరలించారు. రాత్రి సమయంలో ఘటన జరగడంతో ఖమ్మం-బోనకల్ ప్రధాన రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక


బోయినపల్లికి పార్టీ కండువా కప్పుతున్న రాష్ట్ర ఇన్‌చార్జ్ దీప్‌దాస్ మున్షి

వైరా, మార్చి 29: బీఆర్ఎస్ నాయకుడు, ఏపీఐఐసీ మాజీ డైరెక్టర్ బోయినపల్లి కృష్ణమూర్తి శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీప్‌దాస్ మున్షి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వైరాకు చెందిన కృష్ణమూర్తి బీఆర్ ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ నుంచి ఆపార్టీలో చేరారు. ఏడెమిది సంవ త్సరా లుగా బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ ఎస్ అసెం బ్లీ నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. కృష్ణమూర్తి బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బి.మహేష్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో చేరిన వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్

కారేపల్లి: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీవెంకటేశ్వరస్వామిసంత చైర్మన్, సొసైటి డైరెక్టర్ అడ్డగోడ ఐలయ్య శుక్రవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. హైదరాబాద్‌లో ఎమ్మెల్యే ఐలయ్య కాంగ్రెస్ పార్టీకండువ కప్పి పార్టీలో ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, ఏన్కూర్ సొసైటి చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, టీపీసీసీ సభ్యుడు సీతారాములు, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్యా యత్నం

వైరా, మార్చి 29: వైరా మునిసిపాలిటీ నాలుగోవార్డులోని ఫిషరీస్ కాలనీకి చెందిన లాల్ అహ్మద్ అనే యువకుడు కుటుంబ కలహాలతో ఆత్మాహత్యయత్నానికి ప్రయత్నించాడు.ఈ ఘటన వైరాలో శుక్రవారం రాత్రి జరిగింది. బాధితుడు వైరాలోని మధిర రోడ్డులో ఓ దుకాణం ముందు చేయి కోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారస్థితిలోకి వెళ్లడంతో స్థానికులు 108లో ఖమ్మం తరలించారు.

భూ ఆక్రమణదారులపై రెవెన్యూ పంజా

- ప్రభుత్వ ఇళ్ల స్థలాలు తిరిగి స్వాధీనం
- ఎక్సకవేటర్‌తో 11 ఇళ్లు నేలమట్టం


నిర్మాణాలు కూల్చివేస్తున్న దృశ్యం

రఘునాథపాలెం, మార్చి 29: 1997వరకు ఖమ్మంనగరంలో ఇళ్లు లేని నిరు పేదలకు ప్రభుత్వం నివాస సౌకర్యం కల్పించేందుకు ఇళ్ల స్థలాలను కేటాయిం చింది. అలా గే ప్రభుత్వ అవసరాల కోసం రహదారులు, కాల్వల పక్కన నివాసాలను ఏర్పాటు చే సుకున్న వారి ఇళ్ల స్థలాలను ప్రభుత్వ అవసరాలకు తీసుకొని వారికి రఘు నాథపాలెంలోని సర్వే నెంబర్ 192లో ప్రభుత్వమే ఇంటి స్థలాలను కేటాయించారు. ఇలా ఇంటి స్థలాలను పొందిన వారే నివాసాలను ఏర్పాటుచేసుకొని ఉండాల్సి ఉంది. కాని ఇళ్ల స్థలాలు హక్కు పత్రాలు పొందిన వారు కాకుండా ఆయా స్థలాల్లో ఇతర వ్యక్తులు నివాసాలను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో రఘునాథపాలెం తహసీల్దార్ లూదర్‌విల్సన్ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టా రు. సర్వే నెంబర్ 192లో ఆక్రమణకు గురైన 11 నివాసాలను ప్రొక్లెయిన్‌తో నేలమ ట్టం చేశారు. వీటిలో 1 ఇళ్ల పూర్తిగా ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేయగా మిగిలిన 10 నివాసాలు ప్రభుత్వం ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన హక్కుదారులు కాకుండా ఇతరులు నివాసాలను ఏర్పాటు చేశారు. గురువారం మాజీ సర్పంచ్ భర్తపై 420కేసు నమోదు కాగా మరుసటి రోజు భూ ఆక్రమణలపై ఇళ్ల కూల్చివేత రఘునాథపాలెం మండలంలో భూ ఆక్రమణదారులో అలజడి మొదలైంది.

స్టాప్‌లో బస్సు ఆపలేదని.. డ్రైవర్‌తో ప్రయాణికురాలి వాగ్వాదం

- అర్ధగంట నిలిచిన బస్సు
- ప్రయాణికుల ఇబ్బందులు


డ్రైవర్‌తో గొడవ పడుతున్న ప్రయాణికురాలు

ఖమ్మం ఖానాపురంహవేలీ, మార్చి 29: ఖమ్మం నుంచి మాధారం వెళ్లే ఆర్టీసీ బస్సును స్టాప్‌లో ఆపలేదని శుక్రవారం రాత్రి ఓ ప్రయాణికురాలు డ్రైవర్‌తో గొడవకు దిగింది. దీంతో ఆ బస్సు సుమారు అర్ధగం టకు పైగా ఆగాల్సిన పరిస్థితి ఏర్పడింది. బస్సులోని ప్రయాణికుల వివరాల ప్రకారం ఖమ్మం సిటీబస్టాండ్ నుంచి మాధారం వెళ్లే పల్లెవెలుగు బస్సు ప్రయాణికులతో వెళ్లుతుంది. బస్సులో ప్రయాణికు ల సంఖ్య అధికంగా ఉండటంతో ఆ డ్రైవర్ ఇల్లెందు క్రాస్ రోడ్ వద్ద బస్ ఆపకుండా వెళ్లడంతో ఓ ప్రయాణికురాలు అక్కడే ఉండటంతో ఆ రూట్‌కు అదే చివరి సర్వీస్ కావటంతో ఆమె ఓ ద్విచక్ర వాహనంపై వచ్చి కైకొండాయిగుడెం స్టేజ్ వద్ద బస్సును క్రాస్ చేసి ఆపి డ్రైవర్‌ను దుర్భషలాడారని ప్రయాణికులు తెలిపారు. కాగా ఆమె ఓ ప్రభుత్వ ఆసుపత్రిలో రాత్రి డ్యూటి చేసే ఉద్యోగి కావటం ఆ బస్సు వెళ్తే మరో బస్సు లేకపోవటంతో డ్రైవర్‌తో గొడవ పడ్డట్టు ప్రయాణికులు తెలిపారు. దీంతో డ్రైవర్ బస్సును అర్ధగంటకు పైగా ఆపి ప్రయాణికులు అధికంగా ఉండటంతోనే ఆపలేదని చెప్పినా వినిపించుకోకుండా నోటికొచ్చినట్లు మాట్లాడారని అందుకే బస్సును ఆపావల్సివచ్చిందని తెలిపాడు. దీంతో తోటి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రాత్రి పూట ప్రయాణికులు అధికంగా ఉంటే మరో బస్సును ఏర్పాటు చేయాల్సిన అధికారులు ప్రయాణికులు అడిగినా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవట్లేదని ప్రయాణికులు వాపోతున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వచ్చిన నాటి నుంచి ప్రయాణికులకు సరిపడ బస్సులను ఏర్పాటు చేయక పోవటంతోనే రోజూ గొడవలు పడాల్సిన పరిస్థితులు వస్తున్నాయని ప్రయాణికులు ఆవేదనవ్యక్తంచేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్య


వరుణ్‌కుమార్ (ఫైల్)

మణుగూరుటౌన్, మార్చి 29: మణుగూరు పట్టణ పరిధిలోని లంకమల్లారం గ్రామానికి చెందిన కోరుగట్ల వరుణ్‌కుమార్(27) శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వరుణ్‌కుమార్ కొద్దికాలంగా ఓ యువతితో సహజీవనం చేసాడని, ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో ఆ యువతి వరుణ్‌ను వదిలి వెళ్లిపోయింది. ఆ తర్వాత మరో వ్యక్తిని వివాహం చేసుకుంది. దీంతో మనస్థాపానికి గురైన వరుణ్‌కుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వరుణ్ తండ్రి లాలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసుల దర్యాప్తు చేపట్టారు.

మద్యం మత్తులో పురుగుల మందుతాగి..


శేఖర్ (ఫైల్)

గుండాల: మద్యం తాగొద్దని తల్లి మందలించినందుకు మద్యం మత్తులో పురుగుల మందుతాగి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని నాగారం గ్రామానికి చెందిన జోగ శేఖర్ (29) గురువారం కూలిపనులకు వెళ్లి రాత్రి మద్యం తాగి ఇంటికి రావడంతో మద్యం తాగొద్దని తల్లి మందలించింది. దీంతో మనస్థాపం చెంది మద్యం మత్తులో పరుగుల తాగి ఇంటి స్లాబ్‌పై పడుకున్నాడు.. జాతరకు వెళ్లి వచ్చిన ఇతర కుటుంబ సభ్యులు గమనించి వెంటనే గుండాల ఆసుపత్రికి తీసుకువెళ్లారు అప్పటికే పరిస్థితి విషమించి మృతి చెందాడు. గుండాల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రామాలయానికి వీల్‌చైర్ అందజేత

భద్రాచలం, మార్చి 29: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయానికి వచ్చే దివ్యాంగ భక్తుల కోసం వీల్‌చైర్‌ను మహబూబాబాద్‌కు చెందిన హోప్‌స్టెప్స్ ఫౌండేషన్ సంస్థ వారు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి మాట్లాడుతూ దివ్యాంగుల పట్ల ఫౌండేషన్ వారి సేవలను తెలుసుకొని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు నాగపల్లి శ్రీనివాస్, సభ్యులు సిలివేరు హరీష్, కుర్లే శ్రీనివాస్, చెరుకుపల్లి రమేష్, విజ్జగిరి రవితేజ, ఆలయ క్యాంపు అధికారి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
భద్రాద్రి కొత్తగూడెం
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట
8
శనివారం 30 మార్చి 2024

అడవులను తలపిస్తున్న నర్సరీలు

అధికారుల నిర్లక్ష్యంతో మొక్కల పెంపకం అభాసుపాలు

లక్షలాది రూపాయల నిధులు వృధా

అధికారులు పట్టించుకోవాలని కోరుతున్న ప్రజలు

జూలూరుపాడు, మార్చి 29: గ్రామాలలో పచ్చదనాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో హరితహార కార్యక్రమానికి గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మొక్కల పెంపకానికి గాను పంచాయతీకొక నర్సరీని ఏర్పాటు



గుండ్లరేవు నర్సరీలో



వెంగన్నపాలెం నర్సరీలో ఏపుగా పెరిగిన మొక్కలు



నర్సరీలో ఎండిపోయిన మొక్కలు

చేసి వివిధ రకాలకు చెందిన పూల, పండ్ల మొక్కలతో పాటు రహదారుల వెంట నాటేందుకు మొక్కలను పెంచారు. కాగా గత ఏడాది పెంచిన మొక్కలన్నింటిని నాటలేదు. కొన్ని మొక్కలను నర్సరీలలోనే వదిలేశారు. మండలంలోని గుండ్లరేవు, బేతాళపాడు, వెంగన్నపాలెం, గాంధీనగర్ తదితర పంచాయతీలలోని నర్సరీలలోనే మొక్కలు ఏపుగా ఎదిగి దర్శనమిస్తున్నాయి. కొన్ని రకాల మొక్కలు ఎండిపోయాయి. మొక్కల పెంపకం చేపట్టి ఏడాది కావస్తున్న వాటిని నాటకుండా నర్సరీలలోనే వదిలివేయటంతో అవి మానులుగా పెరిగి అడవులను తలపిస్తున్నాయి. మొక్కల పెంపకానికి లక్షలాది రూపాయల నిధులను కేటాయించినప్పటికి నాటకుండా వాటిని వదిలివేయటం తగదని ప్రజలంటున్నారు. గతంలో పెంచిన మొక్కలను పూర్తి స్థాయిలో నాటకుండానే మళ్లీ నర్సరీలను ఏర్పాటు చేసి కొత్తగా మొక్కలను పెంచడం హాస్యాస్పదంగా ఉందని ప్రజలంటున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో మొక్కల పెంపకం కార్యక్రమం మండలంలో ప్రహసనంగా మారింది. లక్షలాది రూపాయల నిధులు వృథా అయ్యాయని ప్రజలంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి మొక్కల పెంపకానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నెంబర్ పేట్లు లేని వాహనదారులపై చీటింగ్ కేసులు: డీఎస్పీ



పోలీసులు అదుపులోకి తీసుకున్న వాహనాలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి 29: నెంబర్ ప్లేట్ లేని వాహనాలను అదుపులోనికి తీసుకొని ఆ వాహనదారులపై చీటింగ్ కేసులు నమోదు చేశామని కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశాలనుసారం నెంబర్ ప్లేట్ లేని వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ కొత్తగూడెంలో నెంబర్ ప్లేట్‌లు లేకుండా తిరిగే వాహనాలను సీజ్ చేస్తున్నట్లు తెలిపారు. వన్‌టౌన్, టూటౌన్, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా నెంబర్ ప్లేట్‌లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. అందులో భాగంగా నెంబర్ ప్లేట్‌లు లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడిన ముగ్గురిపై చీటింగ్ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడే నేరస్థులు నెంబర్ ప్లేట్‌లు లేకుండా వాహనాలను ఉపయోగిస్తున్నారని, అలాంటి నేరాల నియంత్రణ, ఛేదన కొరకు ఈ విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్, త్రీటౌన్ సీఐ శివప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐలు నరేష్, మధార్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లు సత్ ప్రవర్తనతో మెలగాలి

రౌడీ షీటర్లు సత్ ప్రవర్తనతో మెలగాలని కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ హెచ్చరించారు. శుక్రవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చి రాబోయే పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రభుత్వానికి సహకరించాలన్నారు.

రేపు చిన అరుణాచలంలో ఫొటోల వేలంపాట

దుమ్ముగూడెం, మార్చి 29: నరసాపురం చిన అరుణాచలం ఆలయ ప్రాంగణంలో ఫొటోల వేలం పాట ఆదివారం ఉదయం పదిగంటలకు నిర్వహించనున్నామని ఆలయ వ్యవస్థాపకులు శివనాగస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాడిన వారికి ఆలయంలో ఉన్న విగ్రహాల వద్ద భక్తుల ఫొటోల ప్రింట్‌లు తీసిచ్చేందుకు మాత్రమే పాట నిర్వహిస్తున్నామన్నారు. అలాగే భక్తులు కూడా వారి ఫోన్లలో ఫొటోలు తీసుకోవచ్చన్నారు. ఆసక్తి గల వారు పాటలో పాల్గొనవచ్చని తెలిపారు.

బాలికల గురుకులంలో వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

మణుగూరుటౌన్, మార్చి 29: మణుగూరు ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం ప్రభుత్వ పాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. జలుబు, గొంతునొప్పి, దగ్గుతో బాధపడే విద్యార్థులు కాచి చల్లార్చిన మంచినీటి తాగాలని వైద్యుడు శివకుమార్ విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ నిశాంత్‌రావు, సిబ్బంది రాంప్రసాద్, హిమబిందు, శ్రీకాంత్, సుమ, శైలజ పాల్గొన్నారు.

గుట్ట వెంకన్న పెండ్లి సంబరాలు షురూ

పాల్వంచ టౌన్, మార్చి 29: తెలంగాణ తిరుపతిగా బాసిల్లుతున్న శ్రీనివాసగిరి (గుట్ట) వెంకన్న పెండ్లి సంబరాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 4న స్వామివారి వార్షిక కల్యాణ క్రతువులో భాగంగా స్వామివారి పాదాల మండపం వద్ద ఆలయ ప్రధాన అర్చకులు తోలేటి నగేష్ శర్మ, ఆరుట్ల ఫణిరాజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారికి మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ మంగళ స్నానాలు చేయించారు. పెద్దఎత్తున హాజరైన మహిళా భక్తులు పసుపుకొట్టి, తలంబ్రాల బియ్యం కలుపు క్రతువును నిర్వహించారు. అదేవిధంగా స్వామివారి కల్యాణ విశేషాన్ని తెలుపుతూ తయారు చేసిన వీడియో టీజర్‌ను సబ్బెళ్ళ గోవిందరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భక్త సమాజమండలి అధ్యక్షులు ఆరుట్ల లక్ష్మణాచార్యులు, ప్రధాన కార్యదర్శి డి.రాము, వర్కింగ్ ప్రెసిడెంట్ కే. రామకృష్ణ, గౌరవ అధ్యక్షులు పసుమర్తి వెంకటేశ్వరరావు, తాటికొండ శ్రీలత, పిట్టా లక్ష్మిరెడ్డి, బండి వెంకటేశ్వర్లు, కంతాల వెంకటేశ్వరరావు, సంక్రాంతి రవి, మేదరమెట్ల శ్రీనివాసరావు, పొందూరి నర్సింహారావు,



పసుపు దంచుతున్న మహిళలు

ఎం.నర్సింహారావు, కిలారు పురుషోత్తం, రాంజీ, అంబేద్కర్, సీహెచ్. శ్రీనివాసరావు, ఎస్. వెంకటేశ్వరరావు, మహిళాకమిటీ సభ్యులు, సేవాదళ్ సభ్యులు, పట్టణ ప్రముఖులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

దేశానికి ఆదర్శ నేత ఎన్టీఆర్: టీడీపీ



భద్రాచలంలో పాల్గొన్న వారు

భద్రాచలం, మార్చి 29: దేశానికి ఆదర్శ నేత ఎన్టీఆర్ అని, తెలుగువారి ఆత్మ గౌరవానికి పెద్దపీట వేశారని టీడీపీ మహబూబాద్ పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఎస్కే. అజీమ్, ఉపాధ్యక్షులు కొడాలి శ్రీనివాస్ అన్నారు. భద్రాచలంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని భద్రాచలం టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణలో ప్రజలను పట్టిపీడిస్తున్న పటేల్ పట్వారి వ్యవస్థను రద్దు చేసి మండలీకరణం తీసుకొచ్చిన ఘనత ఎన్టీఆర్‌దేనని అన్నారు. మహిళలకు ఆస్తిలో సగభాగం, దేశంలో మహిళ యూనివర్సిటీ స్థాపించిన ఘనత ఎన్టీఆర్‌దేనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కుంచాల రాజారాం, అబ్బినేని శ్రీనివాస్, కంభంపాటి సురేష్ కుమార్, తాళ్లూరి చిట్టిబాబు, ప్రకాష్‌రావు, రేపాక రాంబాబు, నూతలపాటి రామయ్య, పోటు వెంకటేశ్వరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

ఇల్లెందులో..

ఇల్లెందుటౌన్: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ వేడుకలు శుక్రవారం ఇల్లందులో ఘనంగా నిర్వహించారు. స్థానిక బుగ్గవాగు సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముద్రగడ వంశీ, నర్సన్న, నాగరాజు, రమేష్‌బాబు, రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడులో..

జూలూరుపాడు: టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం జూలూరుపాడులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఆనాడు ఎన్టీఆర్ టీడీపీని స్థాపించి బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఎంతో ప్రాధాన్యత కల్పించారని కొనియాడారు. తెలుగువారి ఖ్యాతిని దేశవ్యాప్తంగా ఇనుమడింపజేసిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని అన్నారు. ఆయన ఖ్యాతి ఎనలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకులు రోకటి నర్సింహారావు, చలమల గోవింద్, నాయకులు నరేష్, కోటం రాజు, చావా వెంకటేశ్వరరావు, దుద్దుకూరి లక్ష్మణరావు, వై. కొండలరావు, సాయిన్ని నాగర్జున, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో..

అశ్వారావుపేట టౌన్: అశ్వారావుపేటలో శుక్రవారం టీడీపీ 42వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ కట్రం స్వామి దొర మాట్లాడుతూ తెలుగుదేశం ఆవిర్భావంతో రాజకీయాలలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని, సమాజంలో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం లభించిందన్నారు. తెలుగువారి ఖ్యాతిని దేశవ్యాప్తంగా ఇనుమడింపజేసిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు నార్లపాటి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి అంకోల్ వెంకటేశ్వరరావు, నర్రా రాకేష్, పోతురాజు నాని, నార్లపాటి సురేష్, బుల్లిబాబు, బ్రహ్మేంద్రరావు సత్తిబాబు గోపీ అంజిబాబు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



సమ్మె నోటీసు అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

పాల్వంచ టౌన్, మార్చి 29: ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్రసమితి సభ్యులు బండి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. వేతనాలను చెల్లించకుంటే ఏప్రిల్ 1 నుంచి సమ్మెకు దిగుతామని హెచ్చరిస్తూ శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముక్కంటేశ్వరరావుకు సమ్మె నోటీసు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ఆధునిక పద్ధతుల్లో కార్మికులకు వైద్యం

రుద్రంపూర్, (సింగరేణి) మార్చి 29: సింగరేణి యాజమాన్యం కార్మికులకు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో అధునిక వైద్యసేవలు అందించే విధంగా చర్యలు తీసుకుంటుందని సింగరేణి డైరెక్టర్ (పా) ఎన్వీకే. శ్రీనివాస్ తెలిపారు. సింగరేణి కార్మికులతోపాటు సమీప ప్రాంత ప్రజలకు సైతం వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. శుక్రవారం సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో జీవీకే పౌండేషన్ ఆధ్వర్యంలో అత్యవసర వైద్య సేవలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ అత్యవసర వైద్యసేవలపై సిబ్బందిని అప్రమత్తం చేసేందుకు సీపీఆర్ పై అవగాహన కల్పించేందుకు రెండురోజులపాటు వైద్యులకు, వైద్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఆసుపత్రిలో మౌళిక సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు సింగరేణి యాజమాన్యం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నట్లు ప్రకటించారు. చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు అత్యవసర వైద్యాన్ని అందించేందుకు సిబ్బందికి ఈ శిక్షణ



మాట్లాడుతున్న సింగరేణి డైరెక్టర్ (పా) శ్రీనివాస్

ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎంసీవో డాక్టర్ విక్టర్ వందనం, డిప్యూటీ సీఎంవో డాక్టర్ సునీల, వైద్యులు మట్రొన్‌మిస్ శాలే, వైద్యులు రవీన్, జావెద్, సతీష్, మధుసూధన్, సీనియర్ పీవో ఎం. శ్రీనివాస్‌తోపాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిస్టులను విమర్శించే స్థాయి లేదు

ములకలపల్లి, మార్చి 29: మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనుల్లో కమ్యూనిస్టులను విమర్శించేస్థాయి మంత్రి అనుచరులకు లేదని, కమ్యూనిస్టులను విమర్శించడం సరికాదని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు నూపా భాస్కర్, సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, సీపీఐ మండల సహాయ కార్యదర్శి నరాటి రమేష్‌లు అన్నారు. శుక్రవారం ములకలపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పూటకో పార్టీ.. రోజుకో పార్టీ కండువా కప్పుకునే వాళ్లు కమ్యూనిస్టులను విమర్శించడం అంటే దెయ్యాల వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. సొంత స్థలాలు వదిలి ఆర్అండ్‌బీ నిబంధనలు తుంగలో తొక్కి భవనాలు నిర్మిస్తూ స్వార్థ ప్రయోజనాల కోసం అభివృద్ధికి అడ్డుపడుతున్న వారెవరో మండల ప్రజలు గమనిస్తూనే ఉన్నారని అన్నారు. ములకలపల్లి మండలంలో అనేక భూ పోరాటాలు నిర్వహించి వేల ఎకరాల భూమిని పేదలకు పంచడంలో కమ్యూనిస్టు పార్టీల చరిత్ర ఘనమైందని పేదలకు ఇళ్ల స్థలాల సాధనలో కమ్యూనిస్టుల పోరాటాలు ఉన్నాయని ఈ పోరాటంలో అనేక కమ్యూనిస్టు నాయకులపై కేసులు, జైలు జీవితాలు, నిర్బంధాలు



మాట్లాడుతున్న నూపా భాస్కర్

ఎదుర్కోవడంలో తమ జీవితాలను ప్రజల కోసం త్యాగం చేసినటువంటి నాయకులు కమ్యూనిస్టు పార్టీల్లో ఉన్నారని ఈ చరిత్ర తెలియని కొంతమంది కళ్లు లేని కబోదులు అవాకులు చవాకులు పేలుతున్నారని, వారు తమ వైఖరి మార్చుకోవాలని కోరారు.

వృద్ధ దంపతులకు వితరణ

దుమ్ముగూడెం, మార్చి 30: సీతానగరం అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన వృద్ధ దంపతులు కొప్పుల నీలం-సావిత్రిలకు ఇల్లందు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇ ద్రి నరేష్ శుక్రవారం సాయమందించారు. అధ్యాపకులు పెయ్యల వినయ్‌కుమార్ ద్వారా విషయం తెలుసుకొని 25 కేజీల బియ్యం, దుప్పట్లు, నిత్యావసరాలనందజేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ.. అవసరంలో ఉన్న పేద వారిని, నిరాశ్రయులను ఆదుకోవడం ఎంతో బాధ్యతతో కూడిన పని అని అన్నారు. వారిని ఆదుకోవడం సరైందన్నారు. నరే ష్, జి.రంజిత్, ఎం.సదానందం, బి.రవి, బి.చందర్, గ్రామస్థులు నారాయణ, ఈటే వీర్రాజు పాల్గొన్నారు.

3 రోజులుగా మంచినీటి సమస్య

మణుగూరుటౌన్, మార్చి 29: వేసవి కాలం ప్రారంభ సమయంలోనే మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో మంచినీటి అవస్థలు ప్రారంభమయ్యాయని సీపీఐ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ అన్నారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజులుగా మున్సిపాలిటీ పరిధిలో మంచినీటి సరఫరా లేక పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతోన్న మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. ప్రతీ ఏడాది వేసవి కాలం ప్రారంభంలో మంచినీటి సమస్య తలెత్తుతుందని తెలిసిన మున్సిపల్ అధికారులు ముందస్తు ప్రణాళికలు చేకుండా ప్రజలను ఇబ్బందులపాలు చేయడం దారుణమన్నారు. మున్సిపాలిటీకి ప్రజల నుంచి అన్ని పన్నులతోపాటు మంచినీటి పన్నును కూడా ముందస్తుగానే వసూలు చేసే అధికారులు నీటి సమస్య నివారణ చర్యల పట్ల నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు.

భానుడి ప్రతాపం.. అల్లాడుతున్న జనం

నిర్మానుష్యమవుతున్న రహదారులు.. శీతల పానీయాలకు గిరాకీ



నిర్మానుష్యంగా కరకగూడెం ప్రధాన రహదారి

కరకగూడెం, మార్చి 29: ఎండలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ప్రజలు ఇంటి నుంచి కాలు బయట పెట్టాలంటే భయాందోళన చెందుతున్నారు. రోహిణి కార్తె రాకముందే మండలంలో భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. మండల కేంద్రమైన కరకగూడెంకు చుట్టు ప్రక్కల నుంచి ప్రజలు పలు సమస్యల కోసం.. వైద్యశాలకు, బ్యాంకు పనులపై రావల్సి ఉంటుంది. నిత్యం రద్దీగా ఉండే కరకగూడెం ప్రధాన సెంటర్ శుక్రవారం ప్రజలు లేక వెలవెల పోయింది. ప్రజలు దాహార్తి తీర్చుకునేందుకు జూస్ పాయింట్ వద్ద చల్లని పానీయాలకు మక్కువ చూపిస్తున్నారు. ఒక వైపు ప్రజలకు రోజురోజుకు పెరుగుతున్న ఎండలకు భయంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కాలు బయట పెట్టలంటే భయంతో వణికి పోతున్నారు.

ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి: వైద్యాధికారి మధు

రోజురోజుకు ఎండ తీవ్రత పెరగడంతో కరకగూడెం వైద్యాధికారి మధును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఎండ సమయంలో బయటకు రావద్దు. అత్యవసర సమయంలో బయటకు వెళ్లిన ప్రజలు తప్పక తెల్లని కాటన్, తెల్లరంగు దుస్తులవులను ముక్కుకు, చెవులకు వేడి గాలి తగలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. వృద్ధులు ఎండ సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా ఉండాలి. ఎండలో ప్రయాణించే సమయంలో కాని వ్యవసాయ పనులకు వెళ్లిన సమయంలో ఎండ తీవ్రతకు గురైన వారు నీరసం, నాలుక పొడి బారడం, కళ్లు తిరగడం, తలనొప్పి, మూత్రంలో మంటలు వంటి సమస్యలు వస్తాయి. ఎండలో ప్రయాణాలు సాగిస్తున్న సమయలంలో చల్లటి నీరును తరచుగా తాగడం వలన ఇలాంటి సమస్యలు రాకుండా నివరించవచ్చు. రోజుకు ఒక్కరు 3 నుంచి 4 లీటర్ల నీరును తాగాలి. ఎండలో పనిచేసేవారు గ్లోకోస్ వాటర్ తీసుకోవాలి.



జ్యూస్ పాయింట్ వద్ద ప్రజలు

కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లక్కినేని

కొత్తగూడెం లీగల్, మార్చి 29: కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లక్కినేని సత్యనారాయణ ఎన్నికయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగిన ఎన్నికల్లో లక్కినేని సత్యనారాయణకు 108ఓట్లు పోల్ కాగా అనుబ్రోలు రాం ప్రసాద్ రావుకు 102, టి. శివారెడ్డికి 10, ఎన్‌వీ రాజేష్‌కు 3 ఓట్లు పోలయ్యాయి. ప్రధాన కార్యదర్శి పదవికి ఎంఎస్ఆర్. రవిచంద్రకు 173ఓట్లు రాగా పి.శ్రీనివాసరావుకు 50ఓట్లు పోలయ్యాయి. 123 అధిక ఓట్లు రాగా ఎంఎస్ఆర్. రవిచంద్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మహిళా రిప్రజంటేటీవ్ పోటీలో నల్లమల్ల ప్రతిభకు 141ఓట్లు రాగా ఎస్‌కే. షాజాన్ పర్వీన్‌కు 78ఓట్లు రాగా 62ఓట్ల మెజార్టీతో నల్లమల ప్రతిభ గెలుపొందగా ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో ఉపాధ్యక్షుడిగా తోట మల్లేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా సందుపట్ల ప్రవీణ్, కోశాధికారిగా అరకల కరుణాకర్, లైబ్రరీ సెక్రటరీగా ఎస్‌కే. సాదిక్ పాషా, ఆటలు, సాంస్కృతిక కార్యదర్శిగా ధూళిపాల రవికుమార్ క్రితమే ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా పలివెల గణేష్‌బాబు, అసిస్టెంట్ ఎలక్షన్ ఎన్నికల అధికారులుగా గాదే సునంద, పాండురంగ విటల్, షేక్ అంకూష్ బాషలు నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.



నూతన కార్యవర్గం

పీవోడబ్ల్యూ పోస్టర్ల ఆవిష్కరణ



మణుగూరుటౌన్, మార్చి 29: సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీపై అక్రమంగా బనాయించిన పూసపల్లి కుట్ర కేసును వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో శుక్రవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ భద్రాచలం డివిజన్ కమిటీ గౌరవ అధ్యక్షురాలు పెద్దగోని ఆదిలక్ష్మీ మాట్లాడారు. అన్ని క్రిమినల్ కేసులను బేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.